Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

ప్రజాతీర్పు

The people's Vcrdict

తెలుగు జాతీయ దినపత్రిక

ప్రజా TV PRAJA TELEVISION The People's Favour

రిపోర్టర్లు కావలెను

అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన

ప్రజా టెలివిజన్

యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622

మా యూట్యూబ్ చానల్‌ను
సపోర్ట్ చేయండి
8309979541

ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 330 | హైదరాబాద్ | శుక్రవారం 16 అక్టోబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOR

డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్

- నగర ట్రాఫిక్ కష్టాలకు చెక్
- ఎల్ బి నగర్ నుంచి హయత్ నగర్ వరకు..
  కేంద్రం గ్రీన్ సిగ్నల్



భాగ్యనగర ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు లైన్ క్లియర్ అయింది. జాతీయ రహదారి-65 పై అత్యంత రద్దీగా ఉండే ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిలోమీటర్ల మేర అత్యాధునిక డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ అధికారికంగా ఆమోదం తెలిపింది.

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జరిపిన ఉన్నత స్థాయి భేటీలో ఈ ప్రాజెక్టుపై సమగ్ర చర్చలు జరగ్గా.. కేంద్రం దీనికి సానుకూలంగా స్పందించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ అనుమతితో హైదరాబాద్ తూర్పు ముఖద్వారమైన విజయవాడ హైవేపై దశాబ్దాలుగా నెలకొన్న ట్రాఫిక్ సమస్యలకు తెరపడనుంది. ఈ భారీ ప్రాజెక్టును మల్టీ-లెవల్ ఇంటిగ్రేటెడ్ డిజైన్‌తో నిర్మించనున్నారు. ప్రస్తుత ప్రతిపాదనల ప్రకారం.. భూమి మీద సాధారణ సర్వీస్ రోడ్లు కొనసాగుతుండగా, మొదటి అంతస్తు వాహనాల రాకపోకల కోసం 3-లేన్ల ఎలివేటెడ్ ఫ్లైఓవర్‌ను నిర్మిస్తారు. ఇక దీనిపై ఉండే రెండో అంతస్తు లో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ మార్గం వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు. రోడ్డు రవాణా, మెట్రో నెట్‌వర్క్ రెండింటినీ ఒకే స్తంభాల వరుసపై అనుసంధానించడం వల్ల భూసేకరణ భారం భారీగా తగ్గడంతో పాటు, సిగ్నల్ రహితంగా వేగవంతమైన ప్రయాణం సాధ్యమవుతుంది. ఈ డబుల్ డెక్కర్ కారిడార్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రయాణించే లక్షలాది మందికి ఊరట లభించనుంది. ప్రస్తుతం ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ మధ్య ఉన్న చింతలకుంట, పనామా, సుష్మ, వనస్థలిపురం, ఆటోనగర్ వంటి ప్రధాన జంక్షన్లలో పీక్ అవర్లలో గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. 7.1 కిలోమీటర్ల ఈ మార్గాన్ని దాటడానికే అరగంట నుంచి నలభై నిమిషాల సమయం పడుతోంది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే సిటీ నుంచి

-2వ పేజీలో



మతం మారితే బీసీ హోదా రాదు!

- ఇస్లాంలోకి మారిన వారికి బీసీ రిజర్వేషన్లు వర్తించవు
- హిందూ సామాజిక వెనుకబాటుతనాన్ని మరో మతంలోకి బదిలీ చేయలేం
- మద్రాస్ హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబరు 15 (ప్రజాతీర్పు)

హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారిన వ్యక్తులు వెనుకబడిన తరగతుల (బీసీ) రిజర్వేషన్లు పొందేందుకు అర్హులు కారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒక వ్యక్తి మతం మారినంత మాత్రాన అతడి సామాజిక, కుల హోదా వాటంతట అవే బదిలీ కావని

-2వ పేజీలో



కుట్ర కాకపోతే మరేమిటి?

- గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న నేహా బోరా, దీప్కే
- 13 కోట్ల ఓట్లను తొలగించడం వెనుక మర్మం ఏమిటి?
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను మోదీ, అమిత్ షాలు ఎందుకు కాపాడుతున్నారు?
- కేంద్ర ప్రభుత్వంపై సీజేపీ వ్యవస్థాపకుడు దీప్కే ఆగ్రహం
- ఓటు హక్కును కాపాడుకోకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేము
- నేడు 'లెహ్రో దో తిరంగా'లో పాల్గొనాలని ప్రజలకు పిలుపు

న్యూఢిల్లీ, అక్టోబరు 15 (ప్రజాతీర్పు)

ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడం ద్వారా ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రభుత్వం కుతంత్రాలు సాగిస్తోందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే

-2వ పేజీలో

వరి వేయొద్దు

యాసంగి సాగును వాయిదా వేసుకోవాలి



- రైతులు పెద్దమనసు చేసుకొని సహకరించాలి
- ఎల్‌నినోతో కొవిడ్ లాంటి సంక్షోభం
- రాబోయే 8, 10 నెలలు రాష్ట్రంలో గడ్డుకాలం
- నీటికి, విద్యుత్‌కు తీవ్ర కొరత తప్పదు
- ప్రస్తుతం ఉన్న నీటినే పొదుపుగా వాడుకోవాలి
- మంత్రులతో ముఖ్యమంత్రి సమావేశం



హైదరాబాద్, అక్టోబరు 15 (ప్రజాతీర్పు)

రాష్ట్రంలో ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో పరిస్థితులు నెలకొన్నాయని, సాగునీటి, తాగునీటి ఎద్దడి తలెత్తుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో రైతులు పెద్దమనసు చేసుకుని యాసంగిలో పంట వేయకుండా వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే 8, 10 నెలల కాలంలో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి ఉందని, రాష్ట్ర ప్రజలు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వ ఉపశమన చర్యల్లో భాగస్వాములు కావాలని కోరారు. గురువారం అందుబాటులో ఉన్న మంత్రులతో ముఖ్యమంత్రి సచివాలయంలో సమావేశమయ్యారు. వివిధ శాఖల ముఖ్యకార్యదర్శులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులపై

-2వ పేజీలో

విదేశీ బొగ్గు దిగుమతిలో భారీ కుంభకోణం

- ఒప్పందాలను బయటపెట్టాలని కేటీఆర్ డిమాండ్
- ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, కేంద్ర బొగ్గు, గనుల మంత్రికి బహిరంగ లేఖలు

హైదరాబాద్, అక్టోబరు 15 (ప్రజాతీర్పు)



విదేశీ బొగ్గు దిగుమతి ముసుగులో రూ.3 వేల కోట్ల భారీ కుంభకోణానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. కావాలనే బొగ్గు కృత్రిమ కొరత, కరెంట్ సంక్షోభం సృష్టించి.. అదనుచూసి తమ అనుకూల కంపెనీని రంగంలోకి దింపారని విమర్శించారు. 'భోత్రా లాజిస్టిక్స్' అనే కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి చేసుకున్న అన్ని ఒప్పందాలు, టెండర్ల వివరాలు, చెల్లింపులన్నింటినీ బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి గురువారం కేటీఆర్ వేర్వేరుగా బహిరంగ లేఖలు రాశారు."సింగరేణికి ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా.. దేశంలో బొగ్గు వనరులు అందుబాటులో ఉన్నా.. దేశీయ సరఫరాను పెంచే చర్యలు తీసుకోకుండా.. విదేశీ బొగ్గు వైపు మొగ్గు చూపడం అనేక అనుమానాలకు తావిస్తోంది. గనుల అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాలు, బొగ్గు నిల్వలు, రవాణా, దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. విద్యుత్ సంక్షోభాన్ని ముందస్తు ప్రణాళికతో ఎదుర్కోవాల్సిన ప్రభుత్వం.. ఇప్పుడు కరెంట్ కోతలపై జనం, రైతుల ఆందోళనను

-2వ పేజీలో



17 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

- వీటిలో వచ్చే ఏడాది 5 రాష్ట్రాల్లో ఎన్నికలు
- విస్మరించిన, యువ, తొలిసారి ఓటరు నమోదుకు ప్రత్యేక డ్రైవ్
- సర్ వివాదం వేళ ఎస్ఎస్ఆర్‌కు ఈసీ ఆదేశం

న్యూఢిల్లీ, అక్టోబరు 15 (ప్రజాతీర్పు)

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రకియ(ూ×=)పై దేశవ్యాప్తంగా రచ్చ జరుగుతున్న తరుణంలో కేంద్ర ఎన్నికల కమిషన్(ఙశ్రీవషిఱశీఅ జశీఎఎఱంంఱశీఅ) సంచలన నిర్ణయం తీసుకుంది. కొత్త ఓటర్లను చేర్చడం, ఎస్ఐఆర్ ద్వారా తొలగించిన వారిని కవర్ చేయడంపై దృష్టి సారించింది. అలాగే వచ్చే ఏడాది ఆరంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న 5 రాష్ట్రాలతో

-2వ పేజీలో



'22ఏ' పేరిట వ్యవస్థీకృత భూదోపిడీ

- కాంగ్రెస్ అవినీతి సంపాదనకు ప్రధాన ఆదాయ వనరు అదే..
- లక్షల మంది భూ యజమానులు, రైతులకు తీవ్ర వేధింపులు
- బాధితులందరికీ న్యాయం చేయాల్సిందే: రాంచందర్‌రావు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలున్నాయి: ఏలేటి
- రేవంత్ ఉద్యోగం ఊడగొట్టేందుకు ప్రజలు సిద్ధం: రఘునందన్

హైదరాబాద్, అక్టోబరు 15 (ప్రజాతీర్పు)

రాష్ట్రంలో 22-ఏ (నిషేధిత జాబితా) పేరుతో వ్యవస్థీకృత భూదోపిడీ జరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు దుయ్య బట్టారు. లక్షలాది మంది భూ యజమానులు, రైతులు తీవ్ర వేధింపులకు గురవుతున్నారన్నారు. పట్టా భూములు, వ్యవసాయ క్షేత్రాలు, ప్లాట్లను అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను భయాందోళనలకు గురిచేస్తూ, వాటి తొలగింపు పేరుతో భారీ అవినీతి దందాకు తెరలేపారని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో భూ కుంభకోణాలు జరిగాయంటూ బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పవర్‌పాయింట

-2వ పేజీలో

మతం మారితే బీసీ హోదా రాదు!

(మొదటి పేజీ తరువాయి)

తేల్చిచెప్పింది. హిందూ మతం నుంచి ఇస్లాం స్వీకరించిన వారికి ముస్లిం బీసీలుగా రిజర్వేషన్లు కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన జీవోను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించిన మద్రాస్ హైకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. గురువారం జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ చంద్రశేఖర్‌ల ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది.

హోదా దానంతటదే బదిలీ కాదు

వెనుకబడిన తరగతులు (బీసీ), అత్యంత వెనుకబడిన తరగతులు (ఎంబీసీ), డీనోటిఫైడ్ కమ్యూనిటీలు (డీఎన్‌సీ), షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) నుంచి ఇస్లాంలోకి మారిన వారిని ముస్లిం బీసీలుగా పరిగణిస్తూ తమిళనాడు ప్రభుత్వం 2024 మార్చి 9న జీవో నంబర్ 15ను జారీ చేసింది. ఈ జీవోను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. దీనిపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వ వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం.. హైకోర్టు తీర్పుతో పూర్తిగా ఏకీభవించింది. ఒక వ్యక్తి మతం మారినంత మాత్రాన రాష్ట్రంలో నోటిఫై చేసిన ఏడు ముస్లిం బీసీ వర్గాల్లో ఆటోమేటిక్‌గా భాగం కాలేరని స్పష్టం చేసింది. హిందూ సామాజిక వ్యవస్థలోని వెనుకబాటుతనాన్ని, రిజర్వేషన్ల ప్రయోజనాలను హిందూయేతర సామాజిక వ్యవస్థలోకి బదిలీ చేయలేమని పునరుద్ఘాటించింది. మద్రాస్ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులోని అంశాలను సుప్రీంకోర్టు సమర్థించింది. ఇస్లాం మత సమానత్వం అనే పునాదిపై ఏర్పడిందని, అందులో సామాజిక అసమానతలకు, కుల వివక్షకు తావులేదని హైకోర్టు చెప్పింది. ఇస్లాంలో కొన్ని వర్గాలను ఫార్వర్డ్‌గా, మరికొన్నింటిని బ్యాక్‌వర్డ్‌గా వర్గీకరించడం ఖురాన్ సూత్రాలకు విరుద్ధమని అభిప్రాయపడింది. ఇస్లాం సమానత్వాన్ని బోధిస్తుందని, దేవుడి దృష్టిలో అందరూ సమానులేనని పేర్కొంది. కేవలం రిజర్వేషన్ల ప్రయోజనాలను కొనసాగించాలన్న ఉద్దేశంతో భిన్నమైన సామాజిక వర్గాల నుంచి వచ్చిన వారిని ఒకే కేటగిరీ కింద చేర్చడం ఏకపక్షం, రాజ్యాంగ విరుద్ధమే కాకుండా ఇస్లామిక్ సిద్ధాంతాలకు వ్యతిరేకమని హైకోర్టు వ్యాఖ్యానించింది.

వరి వేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సుదర్ఘీంగా చర్చించారు.అనంతరం పలువురు మంత్రులతో కలిసి రేవంత్‌రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఎండ వేడిమి వంటి రకరకాల సమస్యలు ఉత్పన్నమవుతాయంటూ శాస్త్రవేత్తలు చెబుతున్నారని తెలిపారు. “దురదృష్టవశాత్తు వాళ్లు ఊహించినట్లుగానే పరిస్థితులు చేయిదాటి పోతున్నాయి. 2019-20లో కొవిడ్ పరిస్థితుల కారణంగా ప్రపంచమే స్తంభించిపోయింది. అలాంటి సంక్షోభాన్ని ఈ రోజు ఎదుర్కొంటున్నాం. ఈ సమస్యను ఎదుర్కోవడానికి, ప్రజలను, జీవరాశులను కాపాడడానికి అందుబాటులో ఉన్న మంత్రులందరినీ పిలిపించి, చర్చించడం జరిగింది. వివిధ శాఖల కార్యదర్శులతో కూడా చర్చించి కొంత కార్యాచరణను రూపొందించాం” అని సీఎం వివరించారు. “ఈరోజు ఒక ప్రకృతి విపత్తును ఎదుర్కొనబోతున్నాం. ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన సందర్భం. సాగునీరు, తాగునీరు లేకపోవడం, పరోక్షంగా విద్యుత్తు వినియోగం పెరగడం, విద్యుత్తు ఉత్పత్తి తగ్గడం వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇది పరిశ్రమలు, ప్రజా జీవితం, దినసరి కార్యక్రమాలపై తీవ్రమైన ప్రభావం చూపబోతుంది. అందుకే వర్షాకాల పంటల సందర్భంలోనే ప్రజలకు విజ్ఞప్తి చేశాం. వర్షాధార పంటలను తక్కువగా వేయాలని చెప్పాం. మేము చెప్పడం వల్ల 13 లక్షల ఎకరాల్లో వరి పంటను వేయకుండా ఇతర పంటల వైపు రైతులు మళ్లారు. అయినా... 56 లక్షల వరకు వరిని పండించారు. నిజానికి అక్టోబరులో రోజుకు 15 వేల మెగావాట్ల విద్యుత్తు వినియోగం ఉండాలి. కానీ... అది 20 వేల మెగావాట్లకు పెరిగింది. ఎండాకాలంలో ఉండాల్సిన ఎండలు అక్టోబరులో ప్రభావం చూపాయి. అయినా 23వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నా, అవసరమైన విద్యుత్తును సరఫరా చేస్తున్నాం. రాష్ట్ర ఆవిర్భావం సందర్భంలో 6-7వేల మెగావాట్ల డిమాండ్ ఉండేది. ఈ 13 ఏళ్లలో 14 వేల మెగావాట్లు అదనంగా పెరిగింది. అయినా... విద్యుత్తుశాఖ సమర్థంగా పని చేసి విద్యుత్తును అందించడానికి కృషిచేస్తోంది”అని సీఎం అన్నారు.

మార్కెట్‌లో విద్యుత్ దొరకడంలేదు..

చేతికి వచ్చే పంట ఎండిపోకూడదని, విద్యుత్‌ను కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. “రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు కూడా ఈ విద్యుత్తు సమస్యను ఎదుర్కొంటు న్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రూ.14-15లకు యూనిట్ విద్యుత్తును కొనుగోలు చేస్తోందని, మనం ఎంత చెల్లించి కొందామన్నా.. మార్కెట్‌లో విద్యుత్తు దొరకని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో అందరినీ ఆదుకోవడానికి, పంటలు దెబ్బతినకుండా ఉండడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోం దన్నారు. “కృష్ణా బేసిన్‌లో ఈ సంవత్సరం 72 శాతం నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. గోదావరి బేసిన్‌లో 40 శాతం తక్కువగా ఉంది. వర్షపాతం 23 శాతం తక్కువగా ఉండడం వల్ల ఈ పరిస్థితులు ఉన్నాయి. ఏ రిజర్వాయర్లలో కూడా నీరు లేక, వట్టిపోయే పరిస్థితుల్లో ఉన్నాయి. 24 వేల గ్రామాలకు తాగునీటిని అందించాల్సిన పరిస్థితి ఉంది. ప్రజలను అప్రమత్తం చేసి, కేంద్రం నుంచి ఎలా సహకారం తీసుకోవాలో సమీక్షించాం. ప్రస్తుత పంటకు సంబంధించి 11, 12 లక్షల ఎకరాలకు ఇబ్బందిగా ఉంది. ఒక్క ఎకరా ఎండిపోకుండా ఉండడానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. గ్రేటర్ హైదరాబాద్‌కు వచ్చే సింగూరు, ఎల్లంపల్లి, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నీటిని పొదుపుగా వాడుకోవాలని నిర్ణయించాం. సాగుకు నీటిని తగ్గించుకుంటూ.. వచ్చే 8-10 నెలలు గడపాలి. గతేడాది ఇదే కాలం నాటికి 462 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. ఈసారి 209 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఈ నీరు నారుమళ్లకే సరిపోతుంది. ఆ తర్వాత పంటకు ఇవ్వ లేం. తాగునీటికి సమస్య తలెత్తుతుంది. అందుకే రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం” అని సీఎం అన్నారు.

నీళ్లను కొనుక్కోలేం..

అందుబాటులో ఉన్న 209 టీఎంసీలను పొదుపుగా వాడుకోవాలని, కేవలం తాగునీటి కోసమే వినియోగిం చాలని సీఎంసూచించారు. ఎవరి తప్పుడు ప్రచారాలనైనా నమ్మి వరి పంటను వేస్తే.. పెట్టుబడి నష్టపోతారని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లు కూడా పేలిపోయే అవకాశం ఉందన్నారు. కూలీలకు పని దొరికే అవకాశం ఉండదని, అందుకే ఉపాధి హామీ ద్వారా పూర్తి స్థాయి పనులను చేపట్టాలని అధికారులకు చెప్పామన్నారు. “భూమి ఉన్న రైతులకు ఇప్పటి పంటకుగాని, రేపు వేసుకోవాల్సిన పంటకు సంబంధించి కేంద్రం సహకరించాలి. కేంద్ర సౌజన్య పథకాల కింద 60శాతం నిధులను కేటాయించాలి. ఈ విషయమై మంత్రివర్గ ఉప సంఘం త్వరలోనే అఖిలపక్షాన్ని పిలిచి భేటీ అవుతుంది” అని సీఎం వివరించారు.

విద్యుత్తు సంక్షోభం...

ప్రస్తుతం రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల విద్యుత్తు వినియోగం నమోదవుతోందని, ఇది ఆషామాషీ వ్యవహారం కాదని సీఎం రేవంత్ అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం, పైశాచిక ఆనందం పొందేవాళ్లకు ఇది కనపడదని వ్యాఖ్యానించారు. ఈ సమస్య నుంచి గట్టెక్కడానికి కేంద్ర ప్రభుత్వ సహకరించాలని, రాష్ట్రానికి అదనంగా విద్యుత్తును అందించాలని కోరాలని నిర్ణయించామన్నారు. “కొంత తక్కువ ధరకు విద్యుత్ ఇవ్వాలి. రైతులకు అవసరమైన విద్యుత్తును కొనుగోలు చేసి, ప్రతి వ్యక్తి అవసరాలను తీర్చాలని అనుకుంటున్నాం. కేంద్రానికి నిధులు చెల్లించైనా విద్యుత్తును తీసుకోవాలని నిర్ణయించాం. కొవిడ్ సందర్భంగా ప్రధానమంత్రి గుళ్లలో గంటలు కొట్టాలన్నా, వీధిలో పళ్లాలు కొట్టాలన్నా కొట్టాం. ఆ రోజు పార్టీలు అని చూడలేదు. ఈరోజు రాజకీయ పార్టీలు అదే స్ఫూర్తిని ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. కలిసికట్టుగా ఈ విపత్తును ఎదుర్కొనడానికి నిలబడాలి” అని అన్నారు. పశు సంపదను జాగ్రత్తగా కాపాడుకోవాలని, పశుగ్రాసం, తాగునీటి కోసం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు ప్రభుత్వం, ముఖ్యమంత్రి, అధికారులు నూటికి నూరు శాతం ప్రయత్నించడంతోపాటు ప్రజలు భాగస్వాములు కావాలి. కేంద్రం సహకరించాలని అన్నారు.

మంత్రులతో సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తున్నాం.ఎల్‌నినో ప్రభావిత సమాచారాన్ని అందించడానికి మీడియా కోసం ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావును నోడల్ అధికారిగా నియమిస్తున్నాం. టోల్ ఫ్రీ నెంబర్ ఇస్తాం. మీడియా అధికారిక సమాచారాన్ని మాత్రమే ప్రజలకు చేరవేయాలి.దసరా పండుగ తర్వాత భట్టి విక్రమార్క నేతృత్వంలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం. రాజకీయ పార్టీలతోపాటు సంఘాలు, కార్మిక సంఘాలను పిలిపించి సమస్యలపై చర్చిస్తాం. కార్యాచరణ రూపొందిస్తాం.ముఖ్యమంత్రి నేతృత్వంలో నవంబరు మొదటి వారంలో అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని నిర్ణయించాం. ప్రధాని, విపుల నిర్వహణ సంస్థ చైర్మన్ అయిన హోంమంత్రిని కలుస్తాం.ప్రజలను అప్రమత్తం చేయడానికి కళాజాత బృందాలు గ్రామాల్లో పర్యటిస్తాయి. నిపుణులను కూడా పత్రికలలో వార్తలు రాయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. సినీ ప్రముఖులతో ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉంది. విజయ్ దేవరకొండ ఇలాంటి అప్పీల్ చేశారు. మరింత మంది సినీ ప్రముఖులు ప్రజలకు పిలుపునివ్వాలి.

17 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

(మొదటి పేజీ తరువాయి)

సహా 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితా వార్షిక ప్రత్యేక సంక్షిప్త సవరణ(స్పెషల్ సమ్మరీ రివిజన్)ను నిర్వహించాలని ఎన్నికల సంఘం గురువారం ఆదేశించింది. ఈ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తుది జాబితాలను జనవరి 4న ప్రచురిస్తారు. సర్‌పై నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి. స్పెషల్ సమ్మరీ రివిజన్(ఎస్ఎస్ఆర్) అనేది వార్షికంగా తప్పనిసరి అని, దీనిని ప్రత్యేకంగా ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో నిర్వహిస్తారని ఈసి సీనియర్ అధికారి ఒకరు వివరించారు. ఈ 17 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక, విస్తృతమైన సవరణ పూర్తయింది.అసోంలో, చట్టపరమైన కారణాల వల్ల ఎస్-ఎస్ఆర్‌కు బదులుగా ప్రత్యేక సవరణ జరిగింది. యువతను చేర్చుకునేందుకు, వచ్చే ఏడాది జనవరి 1న లేదా అంతకంటే ముందు 18 ఏళ్లు నిండే వారిని ఓటరుగా నమోదు కావడానికి అర్హులు. ఇది ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్, పంజాబ్‌లో ఎన్నికలకు ముందే వారు ఓటర్లుగా మారడానికి వీలుంటుంది. ఈ ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు ‘వచ్చే ఏడాది ప్రారంభంలో’ జరగాల్సి ఉందని ఈసీ తన ఎన్నికల అధికారులకు తెలిపింది.గురువారం ఈసీ జారీచేసిన ఉత్తర్వుల్లో ‘విస్మరించిన/ యువ/ తొలిసారి అర్హత సాధించిన ఓటర్లను నమోదు చేయడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని’ సెప్టెంబర్ 29న రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఇచ్చిన సూచనలను ఈసీ ప్రస్తావించింది. ఓటర్ల జాబితాలో పేరు చేర్చడానికి ఫారం 6లో దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ఇందులో వివాదాస్పద అదనపు ఎస్ఐఆర్ డిక్లరేషన్ ప్రస్తావన లేదు. అర్హులైన ఓటర్లను, ముఖ్యంగా యువత, మొదటిసారి ఓటు వేసేవారిని నమోదు చేయడంతోపాటు ఓటర్ల జాబితాలోని నమోదులను సరిదిద్దడమే ఎన్నికల జాబితా సవరణ ముఖ్య ఉద్దేశమని ఈసీ పేర్కొంది. ఎస్ఎస్ఆర్‌లో, ఓటర్ల కోసం బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లరు.ఎందుకంటే ఎస్ఐఆర్ (సర్) ఇప్పటికే జరిగిపోయింది. ఓటర్లను దాదాపుగా గుర్తించారు. ఎస్ఎస్ఆర్ జరగనున్న రాష్ట్రాల్లో అండమాన్, నికోబార్ దీవులు, అసోం, బీహార్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళం, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, మణిపూర్, పుదుచ్చేరి, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. అయితే యూపీ అసెంబ్లీ పదవీకాలం వచ్చే ఏడాది మే 22న ముగుస్తుంది.మణిపూర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్ అసెంబ్లీల పదవీకాలం 2027 మార్చిలో వేర్వేరు తేదీలలో ముగియనున్నాయి. ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950లోని నిబంధనల ప్రకారం, ‘పదవీకాలం ముగియడానికి ఆరు నెలల కంటే ముందే’ ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీకి అనుమతి ఉంటుంది. అలాగే, ఇప్పటివరకు ఎస్ఐఆర్ ప్రారంభం కాని హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, లడఖ్‌లో వాతావరణ పరిస్థితులను బట్టి సవరణ షెడ్యూల్‌ను తగిన సమయంలో ప్రకటిస్తాం” అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కుట్ర కాకపోతే మరేమిటి?

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. 13 కోట్లకుపైగా ఓటర్ల పేర్లను తొలగించడం కుట్ర కాదా? అని నిలదీశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరాటపడుతున్నారని ధ్వజమెత్తారు. సొంత పౌరులపైనే కేంద్ర ప్రభుత్వం యుద్ధం చేస్తోందని ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్‌ను ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో జరిగిన భారీ అవకతవకలకు సీఈసీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలో పలువురు సామాజిక కార్యకర్తలతో కలిసి దీప్సే మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఈసీ చేయాలన్న డిమాండ్‌తో ఈ నెల 10న నిరసన పిలుపు ఇచ్చినప్పుడు ఢిల్లీలో రైల్వే, మెట్రో సేవలను నిలిపివేశారని, నగర సరిహద్దులలో ఉద్రిక్తత వాతావరణం సృష్టించారని ఆక్షేపించారు. మాజీ ముఖ్యమంత్రులు, ఎంపీలు, ప్రతిపక్ష నాయకులను కూడా నిర్బంధించారని ఆక్షేపించారు.జంతర్‌మంతర్‌లో జాతీయ జెండాను ప్రదర్శించినందుకే తమ పార్టీ నేతలు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను అరెస్టు చేసి, తీహార్ జైలుకు పంపించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశ రాజధానిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువత, ప్రతిపక్ష నాయకులపై పోలీసులు ఉక్కుపాదం మోపడాన్ని ఖండించారు. ఫారం--7ను దుర్వినియోగం చేస్తూ ఓ వర్గం ప్రజల ఓట్లను తొలగిస్తున్నారని సినీ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్‌రాజ్ ఆరోపించారు. ఓటర్ల జాబితాల్లో అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సుమారు 200 సంస్థలు ఏకమయ్యాయని చెప్పారు. నిరసన వేదికగా ఉన్న జంతర్‌మంతర్‌ను లేకుండా చేసేందుకు ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. అందుకే దేశమంతా జంతర్‌మంతర్‌గా మారాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటం దేశ యువతకు చెందినదని వివరించారు. ప్రతి జిల్లా, ప్రతి వీధి ఒక నిరసన వేదికగా మారడం తథ్యమని తేల్చిచెప్పారు. ప్రభుత్వ మార్పు కోసం ఉద్యమించాలి: ప్రశాంత్ భూషణ్ దేశంలో రాజ్యాంగబద్ధమైన సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఆందోళన వ్యక్తంచేశారు. ఓటర్ల జాబితా నుంచి అకారణంగా పేర్లు తొలగించడం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. సీనియర్ లాయర్ ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ.. నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జి చేయడం, చట్టవిరుద్ధంగా ముందస్తుగా నిర్బంధించడం సరైంది కాదన్నారు. జంతర్ మంతర్‌లో నిరసనలను నిషేధించడాన్ని తప్పుబట్టారు. దేశంలో ప్రభుత్వ మార్పు కోసం ఉద్యమించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మీడియా సమావేశంలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. నేహా బోరా మాట్లాడుతున్న సమయంలో కొందరు ‘బండ్ కరో, దఫా హో జావో’(ఆపేసి, బయటకు వెళ్లిపోండి) అని గట్టిగా అరిచారు. వారిని బయటకు పంపించాలని మీడియా ప్రతినిధులను నేహా బోరా కోరారు.

మోదీకి జ్ఞానేశ్ ఎందుకంత ముఖ్యం: దీప్సే

“జ్ఞానేశ్ కుమార్ వల్ల మోదీకి లాభం ఏమిటి? ఆయన కోసం మొత్తం ఢిల్లీనే స్తంభింపజేశారు. మోదీకి జ్ఞానేశ్ కుమార్ ఎందుకంత ముఖ్యమైన వ్యక్తి అయ్యారు? ఎన్నికల్లో మోదీ గెలవడానికి జ్ఞానేశ్ కుమారే కారణమని మనం ఎందుకు అనుకోకూడదు? 2024 లోక్‌సభ ఎన్నికల్లో అధికార, విపక్ష కూటముల మధ్య ఓట్ల అంతరం కేవలం 2 శాతం మాత్రమే. 13 కోట్లకు పైగా ఓట్లు తొలగించారు. అంటే సుమారు 14 శాతం ఓట్లు పోయాయి.



డబుల్ డెక్కర్ లఎలివెటెడ్ కారిడర్

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ, సూర్యాపేట వైపు వెళ్లే దూరప్రాంత వాహనాలు నేరుగా హయత్‌నగర్ మీదుగా ఓఆర్ఆర్‌ను చేరుకోవచ్చు. దీనివల్ల ఎల్బీనగర్ చుట్టుపక్కల విస్తరించిన 60కి పైగా కాలనీల స్థానిక ప్రజలకు ట్రాఫిక్ రద్దీ తగ్గి సురక్షిత ప్రయాణం దక్కుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో శరవేగంగా డీపీఆర్ సిద్ధం చేసి, త్వరలోనే టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్.. హైదరాబాద్ నగర రవాణా ముఖచిత్రాన్ని ఆధునీకరించడమే కాకుండా, తూర్పు హైదరాబాద్ ప్రాంత రియల్ ఎస్టేట్, వాణిజ్య విస్తరణకు మరింత వేగాన్ని చేకూర్చనుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

విదేశీ బొగ్గు దిగుమతిలో భారీ కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

బూచిగా చూపించి.. దిగుమతులను అనుకూలంగా మలచుకోవడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉంది. టన్నుకు రూ.1,500 కమీషన్ చొప్పున ఏకంగా రూ.3,000 కోట్ల దోపిడీకి చీకటి ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిసిపోయింది.అందుకే ఇన్నాళ్లూ కనీసం సమీక్ష సమావేశాలు నిర్వహించకుండా హడావిడిగా విదేశీ బొగ్గు స్కాంకు తెరలేపారు. ఈ వ్యవహారంలో భోత్రా లాజిస్టిక్స్ కంపెనీకి సింగరేణిలో కాంట్రాక్టులు అప్పగించడంలో అనుసరించిన ప్రమాణాలేంటి? ఏ అర్హతల ఆధారంగా ఈ సంస్థను ఎంపిక చేశారు? ఆ కంపెనీకి ఇప్పటివరకు అప్పగించిన కాంట్రాక్టులు, చెల్లించిన నిధులపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలి” అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

‘22ఏ’ పేరిట వ్యవస్థీకృత భూదోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

ర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. 22-ఏ నిషేధిత జాబితా అనేది కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి సంపాదనకు ప్రధాన వనరుగా మారిందని ఆరోపించారు. క్రమబద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగి.. 20-30 ఏళ్లుగా ప్రజల ఆధీనంలో ఉన్న వ్యవసాయ భూములు, ప్లాట్లను సైతం 22-ఏ జాబితాలో చేరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 22-ఏ నిషేధిత జాబితాలో భూముల చేర్పు, తొలగింపుల ప్రక్రియలో ప్రభుత్వం పూర్తి పారదర్శకత పాటించాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అన్నీ కుంభకోణాలే: ఏలేటి

ాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య చీకటి ఒప్పందాలు కొనసాగుతున్నాయని ఏలేటి ధ్వజమెత్తారు. అందుకే.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూదందాలపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు ఆదేశించడం లేదన్నారు. ధరణి నుంచి భూభారతి వరకు సాగిన భూకుంభకోణాలపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఫోరెన్సిక్ ఆడిట్‌లో భయంకర వాస్తవాలున్నట్లు ప్రకటించిన రెవెన్యూ మంత్రి పొంగులేటి.. ఆ వివరాలను ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. ‘రాష్ట్రంలో 66,33,313 ఎకరాల అటవీ భూమి ఉండాల్సి ఉండగా, 42,53,532 ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉందని మంత్రి చెప్పారు. ఆ మిగిలిన 23,79,781 ఎకరాల అటవీ భూమి ఏమైంది..? హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కోటి 79 లక్షల ఎకరాల విలువైన భూదాన్ భూములుండగా, వాటిని 22ఏ జాబితాలో ఎందుకు ప్రదర్శించలేదో స్పష్టత ఇవ్వడం లేదు?’ అని ప్రశ్నించారు. ‘పూలగూడలోని సర్వే నం.285, 286, 287 పరిధిలోని భూమిని ఎవాక్యూ ప్రాపర్టీ అని పేర్కొంటూ 2025 నవంబరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించింది. కానీ, రెవెన్యూ మంత్రి కుటుంబానికి చెందిన ‘నోవా బై రాఘవ’ ఎంట్రీ ఇవ్వగానే తిరస్కరించిన భూమికే ల్యాండ్ కన్వర్షన్, హైరైజ్ బిల్డింగ్ అనుమతులన్నీ రాత్రికి రాత్రే వచ్చేయడం.. అధికార దుర్వినియోగం కాదా?’ అని నిలదీశారు. ‘కరెంటు ఇయ్యకపోతే ఉద్యోగాలు తీసేస్తామని కాంగ్రెస్ నాయకత్వం హైదరాబాద్‌లో కూర్చోని అధికారులను బెదిరిస్తోంది.. వాళ్ల ఉద్యోగాలు పోతాయో లేదో కానీ.. ఇంకో ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ నేతలతో పాటు రేవంత్‌రెడ్డి ఉద్యోగం ఊడగొట్టేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధమయ్యారు’ అని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. 24 గంటల కరెంటు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రజలను అరిగోసలు పెడుతోందని ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని ఎల్.బంజర్‌పల్లి, చందాపూర్, వరదరాజుపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు, భూమి పూజతో పాటు ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏ పల్లెటూరుకు పోయినా కనీసం 12 గంటల కరెంటు వస్తలేదని, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోతున్నాయని రైతులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు లేవు, పింఛన్లు పెంచలేదు, రోడ్లు బాగు చేయలేదు.. ఇదేనా మూడేళ్ల కాంగ్రెస్ పాలన అని నిలదీశారు.

తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కండి

చెన్నై సదస్సులో మంత్రి డి.శ్రీధర్‌బాబు



చెన్నై (వడపళని): తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తమిళనాడుకు చెందిన పారిశ్రామికవేత్తలను ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సహకారంతో చెన్నైలోని ఐటీసీ గ్రాండ్ చోళాలో గురువారం జరిగిన ‘ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ 2026’లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ..తాము తమిళ నాడుతో పోటీ పడేందుకు చెన్నైకి రాలేదని, తమ ప్రయాణంలో ఇక్కడి పారిశ్రామికవేత్తలు భాగస్వా ములు కావాలని కోరుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ‘రైజింగ్ 2047’ విజన్‌తో భారత్ ఫ్యూచర్ సిటీగా తెలంగాణ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. డిసెంబరు 7 నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ సమిట్ జరగనుందని, తమిళనాడు పారిశ్రామికవేత్తలు హాజరుకావాలని మంత్రి ఆహ్వానించారు. తెలంగాణ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొని రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాల గురించి వివరించారు.



కొత్తగట్టు టోల్ ప్లాజా వద్ద వసూళ్లు షురూ

- నేటి ఉదయం 8 గంటల నుంచి టోల్ ఫీజు అమలు.. వాహనాల వారీగా రేట్లు ఖరారు

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 15

కొత్తగట్టు వద్ద ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాలో గురువారం ఉదయం 8 గంటల నుంచి టోల్ ఫీజు వసూళ్లు ప్రారంభించనున్నట్లు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (చీనూ×) వెల్లడించింది. మానకొండూర్ బైపాస్ నుంచి పలవెల్పుల వరకు 68 కిలోమీటర్ల మేర చేపట్టిన నాలుగు లేన్ల రహదారి విస్తరణలో భాగంగా ఈ టోల్ ఫీజులను అమలు చేయనున్నారు. వాహనాల తరగతుల వారీగా టోల్ ఛార్జీలను నిర్ణయించారు. కార్లకు రూ.160, లైట్ వెహికల్స్‌కు రూ.255, బస్సులు, ట్రక్కులకు రూ.535, మూడు యాక్సిల్స్ వాహనాలకు రూ.580, హెవీ వెహికల్స్‌కు రూ.835, ఓవర్‌సైజ్డ్ వాహనాలకు రూ.1,020గా రేట్లు ఖరారు చేశారు. నెలవారీ పాస్ ధరను రూ.360గా నిర్ణయించారు. టోల్ వసూళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తమ ప్రయాణ ఖర్చుల్లో టోల్ ఛార్జీలను పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. వాహనదారులు తమ వాహన తరగతికి వర్తించే రేటును టోల్ ప్లాజా వద్ద నిర్ధారించుకోవడం మంచిది.



శాతవాహన యూనివర్సిటీలో ఖాళీల కొరత.. 47 పోస్టులు ఖాళీ!

63 అధ్యాపక పోస్టులకు 16 మందే.. బోధన, పరిశోధనపై ప్రభావం

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 15

శాతవాహన యూనివర్సిటీలో అధ్యాపక పోస్టుల ఖాళీలు ఉన్నత విద్యకు సవాలుగా మారుతున్నాయి. విశ్వవిద్యాలయంలో మొత్తం 63 అధ్యాపక పోస్టులు ఉండగా, ప్రస్తుతం కేవలం 16 పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. మిగిలిన 47 పోస్టులు ఖాళీగా ఉండటంతో బోధన, పరిశోధన కార్యకలాపాలపై ప్రభావం పడుతోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కాకపోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ఏళ్ల తరబడి నియామకాలు చేపట్టకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడం, పరిశోధన కార్యక్రమాలను విస్తరించడం సవాలుగా మారుతున్నాయని విద్యారంగ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను గుర్తించి, తక్షణమే నియామక ప్రక్రియ చేపట్టాలని విద్యారంగ వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఉన్నత విద్యా ప్రమాణాలను కాపాడేందుకు ప్రభుత్వం స్పందించి, శాతవాహన యూనివర్సిటీలో అధ్యాపకుల కొరతను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాయి.



జయ దుర్గ అమ్మవారి పూజలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 15.

పట్టణంలోని విద్యానగర్‌లో జయ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగిత్యాల ఎమ్మెల్యే డా. శ్రీ సంజయ్ కుమార్ జయ దుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొందారు. జయ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అరవ లక్ష్మి , మున్సిపల్ చైర్‌పెర్సన్ సమిండ్లా వాణి శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య, ప్యాక్స్ చేర్మన్ దామోదర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, మున్సిపల్ కౌన్షన్ సభ్యులు గట్టు సతీష్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగాబుషణం మరియు జయ దుర్గ సేవా సమితి నిర్వాహకులు ముసిపట్ల లక్ష్మీనారాయణ, దాసరి దామోదర్, నలువాల శ్రీకాంత్, బిట్టు, గాదె కార్తీక్, అలిశెట్టి కిషన్, సింగారావు, నడిపి గంగారాం, ఫణిభూషణ్, ప్రసన్న, శ్రీరామ్, భగీరథ, నలువాల భగీరత్, అలిశెట్టి సాయిభూషణ్ తమ్ముడు సాయి, హరీష్, తిరుపురం రాంచందర్, ద్యావనపెల్లి శంకర్, మాధురి, ఆయన్స్, ఆధ్వి తదితరులు, యూత్ సభ్యులు పాల్గొంటున్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుసన్మానం

ఎల్లారెడ్డిపేట , అక్టోబర్ 15 ప్రజాతీర్పు



రాచర్ల బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతనంగా నియమితులైన డైరెక్టర్ మిట్టపెల్లి లక్ష్మన్‌ను రాచర్ల బొప్పాపూర్ గ్రామ శ్రీ భద్రకాళి ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించడంతో పాటు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. నూతనంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన మిట్టపెల్లి లక్ష్మన్‌కు కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో రైతుల సంక్షేమానికి, వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి తన వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ భద్రకాళి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్టోబర్ 21 నుండి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు ప్రారంభం:

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) యాక్టింగ్ 15.

పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల సంస్మరణ లో భాగంగా ఈనెల 21న "పోలీస్ ఫ్లాగ్ డే" కార్యక్రమంలో స్మృతి పరేడ్ నిర్వహించి అమర వీరుల త్యాగానికి నివాళులు అర్పించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ గారు తెలియజేయడం జరిగింది.పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల స్మరణలో భాగంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం "పోలీస్ ఫ్లాగ్ డే " సందర్భంగా సంస్మరణ కార్యక్రమాలను అక్టోబర్ 21 నుండి జాతీయ ఐక్యత దినోత్సవం అక్టోబర్ 31వ (తేది :21- 10- 2026 నుండి 31 -10 -2026) వరకు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఓపెన్ హౌస్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు, పాఠశాలల్లో, కళాశాలలో ఆన్లైన్ లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థులకు పోలీసులు వినియోగించే ఆయుధాలు, చేయు విధులు, అత్యవసర పరిస్థితుల్లో చేయవలసిన అంశాలపై, పోలీసులు చేసిన ప్రతిభ, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం. ఆన్లైన్ ద్వారా ప్రతి పోలీస్ స్టేషన్లో మండల ల వారీగా విద్యార్థులను పోలీస్ స్టేషన్కు ఆహ్వానించి పోలీస్ స్టేషన్ నిర్వహణపై అవగాహనను కల్పించడం జరుగుతుంది. వ్యాసరచన పోటీలు: ఆన్లైన్లో ఈ వెబ్ సైట్ ద్వారా వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరుగుతుంది. వ్యాసరచన పోటీలు మూడు భాషల్లో అనగా తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో అభ్యర్థులు పాల్గొనవచ్చును



12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు:

1.సైబర్ నేరాల నివారణలో పౌరులు, పోలీసుల పాత్ర.

2.మాదకద్రవ్యాల ముప్పు -- వాటి నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఎలా దూరంగా ఉండాలి.

డిగ్రీ ఆపై చదువుతున్న విద్యార్థులకు:

1.సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర.

2.తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చడంలో నా పాత్ర.

అనే అంశాల మీద విద్యార్థులకు "ఆన్లైన్ నందు వ్యాసరచన పోటీలు" నిర్వర్తించడం జరుగుతుంది ఆన్లైన్లో 28 అక్టోబర్ 2026 వరకు సమర్పించవచ్చును. ప్రతిభ కనబరిచిన ముగ్గురు అభ్యర్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి బహుమతులు సంపాదించాలని అన్నారు. షార్ట్ ఫిలిమ్స్, ఫోటోగ్రఫీ పోటీలు: జిల్లా పరిధిలో విద్యార్థిని, విద్యార్థులకు, యువతకు, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు, వీడియో గ్రాఫర్లకు, పోలీసులు చేసిన సేవలకు సంబంధించిన ఫోటోలు లేదా రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాలలో పోలీసుల సేవ, ఇతర పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలపై మూడు నిమిషాలకు మించకుండా షార్ట్ వీడియోలను రూపొందించాలని, ప్రతిభ కనబరిచిన మొదటి మూడు ఫోటోలను, వీడియోలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి రాష్ట్ర పోటీల్లో పాల్గొనే విధంగా అర్హత లభిస్తుందని తెలియజేశారు. ఫోటోలు, వీడియోలు ఈనెల తేది: 23-10-26 లోపు సంబంధిత పోలీస్ స్టేషన్లలో అందించాలి. పోలీస్ అమరవీరుల స్మరిస్తూ పోలీస్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిర, సైకిల్ ర్యాలీ పోలీస్ అమరవీరుల కుటుంబాలకు దగ్గరికి వెళ్లి వారి త్యాగాలకు గుర్తుగా నివాళులు అర్పించడం జరుగుతుంది. ఈ నెల 21వ తేదీ నుండి 31వ తేదీ వరకు పబ్లిక్ స్థలాల్లో, పోలీస్ అమరవీరుల గురించి తెలుపుతూ పోలీస్ కళా బృందం తో పాటల కార్యక్రమాలు నిర్వహించడం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల పరిదిలోని ప్రధాన కూడళ్ళ వద్ద పోలీస్ అమరవీరుల బ్యానర్లను ఏర్పాటు చేయడం జరుగుతుంది.

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లో ఏసీబీ దాడులు

- రూ.8 వేల లంచం తీసుకుంటూ వేములవాడ రూరల్ తహసీల్దార్, జీపీఓ అరెస్ట్
- భూ సంబంధిత పనికి లంచం డిమాండ్ చేసినట్లు బాధితుడి ఫిర్యాదు

(పాష సయ్యద్ వేములవాడ ప్రజాతీర్పు) అక్టోబర్ 15



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. భూ సంబంధిత పనికి లంచం తీసుకుంటుండగా తహసీల్దార్ అబూబాకర్, కార్యాలయ జీపీఓ అనిల్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేందర్ రెడ్డి వెల్లడించారు. ఏసీబీ డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా నూకలమర్రి గ్రామానికి చెందిన ఓ బాధితుడు తన పేరిట భూమిని మ్యుటేషన్ చేయించుకునేందుకు వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయాన్ని పలుమార్లు సంప్రదించినట్లు తెలిపారు. అయినప్పటికీ పని పూర్తికాకపోవడంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ప్రణాళిక ప్రకారం నిఘా ఏర్పాటు చేశారు. బాధితుడి నుంచి భూభారతి ఆపరేటర్ అనిల్ ద్వారా రూ.8,000 లంచం తీసుకుంటున్న సమయంలో తహసీల్దార్ అబూబాకర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు డీఎస్పీ మహేందర్ రెడ్డి తెలిపారు. అనంతరం కార్యాలయంలో సోదాలు నిర్వహించి, ఈ వ్యవహారానికి సంబంధించి ఇద్దరినీ అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అరెస్టు చేసిన నిందితులను శుక్రవారం ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి ఎస్ పి ఏ సి బీ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏ సీ బీ టూల్ ఫ్రీ నెంబర్ 1064 కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆపదలో బాలుడి కుటుంబానికి అండగా పూర్వ విద్యార్థులు

ప్రమాదంలో గాయపడిన ధ్రువన్‌కు రూ.30 వేల ఆర్థిక సాయం

పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి అక్టోబర్ 15

ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2002--2003 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. బేతంపూడి గ్రామపంచాయతీ పరిధిలోని వెంకట్యతండాలో ఇటీవల జరిగిన ప్రమాదంలో నలుగురు గాయపడగా, వారిలో ఆంగోత్ ధ్రువన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు స్పందించి, ధ్రువన్ తల్లి ఆంగోత్ గీతకు ఫోన్‌పే ద్వారా రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సహాయ కార్యక్రమానికి మిత్రులు వంశీ, ఇస్లావత్ రవి ఆధ్వర్యం వహించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తమ బ్యాచ్‌కు సంబంధం లేని కుటుంబం ఆపదలో ఉందని తెలిసినా, మానవతా దృక్పథంతో స్పందించి ఆర్థిక సాయం అందించడం పలువురి ప్రశంసలు అందుకుంది. కులమతాలు, ప్రాంతీయ భేదాలు, వ్యక్తిగత పరిచయాలకు అతీతంగా కష్టకాలంలో బాధితులకు అండగా నిలవడమే నిజమైన మానవత్వమని పూర్వ విద్యార్థులు తమ సేవా భావంతో చాటిచెప్పారు.



మంచిర్యాల : జైపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా:

(అరికిల్ల జయ్ కుమార్, ప్రజా తీర్పు, మంచిర్యాల) అక్టోబర్15

జైపూర్ పోలీస్ స్టేషన్ నిర్వహణ,సాంకేతిక పరిజ్ఞానం వినియోగం,రోడ్డు ప్రమాదాల నివారణపై ఆదేశాలు, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం జైపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి,సిబ్బంది విధుల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో తరచుగా నమోదవుతున్న నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఎస్ఐ భూమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ,స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌లో వివరాల నమోదు,కేసులు మరియు రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించారు.నేరాల నియంత్రణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని సీపీ సూచించారు. రౌడీషీటర్లు,నస్పెక్ట్ షీట్‌లో ఉన్న వ్యక్తులు,ఇతర నేరస్తుల ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ,వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ మేనేజ్‌మెంట్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.స్టేషన్ పరిసరాలు, రికార్డులు,ఫైళ్లు, పరికరాలు,పని ప్రదేశాలను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచాలని తెలిపారు. స్టేషన్‌లో విధులు నిర్వహించే ప్రతి అధికారి,సిబ్బందికి సీసీటీఎన్ఎస్‌పై పూర్తి అవగాహన ఉండాలని, అవసరమైన వారికి శిక్షణ అందించి వ్యవస్థపై పూర్తి పట్టు సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు;

ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సీపీ ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి,సంబంధిత శాఖల సమన్వయంతో హెచ్చరిక బోర్డులు, రహదారి సూచికలు, రంబుల్ స్ట్రిప్స్ తదితర భద్రతా ఏర్పాట్లు చేయించాలని సూచించారు. అతివేగం,మద్యం సేవించి వాహనాలు నడపడం,హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం,రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజల్లో రోడ్డు భద్రతపై నిరంతరం అవగాహన కల్పిస్తూ, ప్రమాదాల నివారణకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ తనిఖీలో సీపీ మరియు జైపూర్ ఏసీపీ ఆర్.వెంకటేశ్వర్లు, జైపూర్ సీఐ నవీన్ కుమార్ ఉన్నారు.

17 రాష్ట్రాల్లో ఎస్ఎస్ఆర్

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సమీక్ష(సర్) ప్రక్రియపై ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో ఎన్నికలు జరగనున్న ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, గోవాతో సహా మొత్తం 17 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సారాంశ సమీక్ష(స్పెషల్ సమ్మరీ రివిజన్-ఎస్ఎస్ఆర్)ను చేపట్టనున్నట్లు భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) ఆయా రాష్ట్రాలకు తెలియచేసింది. ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాలతో సహా సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు రాసిన లేఖలో ఈ ప్రక్రియ కోసం 2027 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా నిర్ణయించినట్లు ఈసీఐ పేర్కొంది.

సాయిశుభ చెక్క"గానుగ నూనె" కేంద్రం ప్రారంభం

- ప్యూర్‌గా ఉంటేనే ఆరోగ్యం పదిలం
- గానుగ నూనెల వాడకం శ్రేయస్కరం
- జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్.

జమ్మికుంట, అక్టోబర్ 15 ప్రజాతీర్పు

ప్రస్తుత కలుషిత వాతావరణం, జీవనశైలి మార్పుల నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన "సాయిశుభ చెక్క గానుగ నూనె"ఉత్పత్తి కేంద్రాన్ని వారు ముఖ్య అతిథిగా హాజరై వైభవంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ... ప్రస్తుతం మార్కెట్‌లో లభించే అనేక రకాల రసాయనపూరిత, కల్తీ నూనెల వల్ల ప్రజలు అనేక తీవ్రమైన రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాచీన కాలం నుండి మన పూర్వీకులు వాడిన సహజసిద్ధమైన చెక్క గానుగ నూనెలను



వాడడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని ఆయన స్పష్టం చేశారు. ప్రకృతి సిద్ధంగా లభించే నూనెగింజల నుండి చెక్క గానుగ ద్వారా తీసే నూనెలో పోషకాలు పదిలంగా ఉంటాయని, ఇలాంటి స్వచ్ఛమైన నూనెలను వాడడమే ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని అన్నారు.కొత్తపల్లి పరిసర ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన నూనెను అందుబాటులోకి తీసుకువచ్చిన నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.వ్యాపారంతో పాటు ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రశంసనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, స్థానిక కౌన్సిలర్లు గుర్రం కావ్య - పరశురామ్, పోల్నేని అజయ్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం.. ప్రతి మెతుకూ విలువైనదే!







- ఆహార వృథాను అరికడదాం..
- ఆకలి రహిత సమాజం కోసం అడుగులు వేద్దాం

జక్కుల శ్రీకాంత్, కరీంనగర్, ప్రజాతీర్పు

అక్టోబరు 15

నేడు ప్రపంచ ఆహార దినోత్సవం. ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం అందించడం, ఆకలిని నిర్మూలించడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. వివాహాలు, శుభకార్యాలు, విందుల్లో టన్నుల కొద్దీ ఆహారం వృథా అవుతుండగా, మరోవైపు ఎంతోమంది ఆకలితో అలమటిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. రైతు కష్టంతో పండిన ప్రతి గింజను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉంది.

వేడుకల్లో వృథా.. పేదలకు అందని ముద్ద!

ప్రస్తుతం వివాహాలు, విలాసవంతమైన శుభకార్యాల్లో అవసరానికి మించి వంటకాలు సిద్ధం చేస్తున్నారు. అతిథులు ప్లేట్లలో ఎక్కువగా వడ్డించుకుని తినలేక పారేస్తున్నారు. చివరకు మిగిలిన అన్నం, కూరలు చెత్తకుప్పల పాలవుతున్నాయి. ఇది ఆహారంతోపాటు నీరు, విద్యుత్, రైతుల శ్రమ, ప్రకృతి వనరుల వృథాకు కారణమవుతోంది. మరోవైపు పేదలు, నిరాశ్రయులు కనీసం ఒక పూట భోజనం కోసం ఎదురుచూస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ వ్యత్యాసాన్ని తొలగించేందుకు ఆహార వృథాను అరికట్టి, మిగిలిన సురక్షిత ఆహారాన్ని అవసరమైన వారికి అందించేలా చర్యలు తీసుకోవాలి.

వాతావరణ మార్పులతో ఆహార భద్రతకు ముప్పు

అకాల వర్షాలు, వరదలు, కరువు, వడగాలుల ప్రభావంతో వ్యవసాయ రంగం సవాళ్లను ఎదుర్కొంటోంది. పంటలు దెబ్బతినడం, ధాన్యం తడిసిపోవడం, సరైన నిల్వ సదుపాయాలు లేకపోవడం వల్ల ఆహార నష్టాలు పెరుగుతున్నాయి. ఉత్పత్తి నుంచి నిల్వ, రవాణా వరకు ఆహారాన్ని కాపాడుకోవడం అవసరం. ధరల పెరుగుదల కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు పౌష్టికాహారం అందుబాటులో ఉండేలా చూడటం కూడా కీలకం.

ప్రతి గింజను కాపాడుదాం

1945 అక్టోబరు 16న ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) ఏర్పాటైన సందర్భంగా ఏటా ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అవసరమైనంత ఆహారమే ప్లేట్లో వడ్డించుకోవడం, మిగిలిన ఆహారాన్ని నిర్లక్ష్యంగా పారేయకుండా చూడటం, పేదలకు సహాయం చేయడం వంటి అలవాట్లను ప్రతి ఒక్కరూ పాటించాలి. రైతు శ్రమను గౌరవిస్తూ, ఆహారాన్ని వృథా చేయకుండా, ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం అందేలా కృషి చేసినప్పుడే ఆకలి రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.





ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్.ఎల్.పి విప్ కేపీ వివేకానంద్

బాచిపల్లి, అక్టోబర్ 15 ప్రజా తీర్పు,

భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని, ఈ రోజు బాచుపల్లి పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో మహమ్మద్ సలీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డాక్టర్ అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, సాధారణ కుటుంబంలో జన్మించి తన అసాధారణ ప్రతిభ, కఠోర శ్రమ, అంకితభావంతో దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన మహనీయుడని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత కలలు కనాలని, ఆ కలలను సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని కలాం ఇచ్చిన సందేశం నేటికీ ఎంతో ప్రాసంగికమని తెలిపారు. దేశ రక్షణ, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి విశేష సేవలందించిన కలాం ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, విద్యార్థులు మరియు యువత ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ మాజీ కార్పొరేటర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద, బోరంపేట్ పాక్స్ చైర్మన్ మిద్దెల బాల రెడ్డి, కొంపల్లి మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు, బాలాజీ నాయక్, గాజుల సుజాత, కోఆప్షన్ సభ్యుడు చంద్రగిరి సతీష్, నాయకులు సాంబశివ రెడ్డి, ఖాదరయ్య, బిక్షపతి, చంద్రయ్య, ప్రవీణ్, విద్యాసాగర్, రియాజ్, సుకన్య, సువర్ణ, ఎస్.వి. సురేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు రమేష్, తిరుపతి, మోహన్, సురేష్, కృష్ణ, చోటు, సోహైల్, ఫజల్, పర్వేజ్, మరియు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో నేత్రదానం.. మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపే మహోన్నత నిర్ణయం

- లయన్స్ క్లబ్ ప్రోత్సాహంతో ముందుకొచ్చిన దివంగత గంటా రమణయ్య కుటుంబ సభ్యులు

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 15



కరీంనగర్: వ్యక్తిగత దుఃఖంలోనూ మానవత్వానికి పెద్దపీట వేస్తూ దివంగత గంటా రమణయ్య (65) కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకు రావడం అభినందనీయమని కరీంనగర్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. మరణానంతరం ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. కరీంనగర్‌లోని మెడికవర్ హాస్పిటల్స్‌లో గంటా రమణయ్య కన్నుమూసిన అనంతరం, కరీంనగర్ లయన్స్ క్లబ్‌కు చెందిన కోల అన్నారెడ్డి, మ్యాదం శివకాంత్ పటేల్ కుటుంబ సభ్యులకు నేత్రదానం ప్రాముఖ్యతను వివరించి, ఈ మహత్తర కార్యానికి ప్రోత్సహించారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రతినిధి సతీష్ సమన్వయంతో నేత్రదాన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ఈ దానం ద్వారా కార్నియా సమస్యలతో చూపు కోల్పోయిన వారికి దృష్టిని తిరిగి పొందే అవకాశం కలుగుతుంది. ఈ కార్యక్రమానికి గంటా రమ, కుమారుడు గంటా వంశీ, కోడలు గంటా అర్చన, అవతురి కవిత--రంజిత్, ఆకుల వీణ--యాదయ్య, డాక్టర్ అవతురి మీరా, డాక్టర్ అవతురి కిషన్, కోల అన్నారెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు సహకరించారు.

నేత్రదానంపై అవగాహన పెంచాలి

నేత్రదానం ద్వారా మరణానంతరం కూడా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. కార్నియల్ అంధత్వంతో బాధపడుతున్న వారికి సహాయం అందించేందుకు ప్రజలు నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలని, ఆసక్తి ఉన్నవారు నేత్రదానానికి ప్రతిజ్ఞ చేయాలని లయన్స్ క్లబ్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. దివంగత గంటా రమణయ్య కుటుంబ సభ్యులకు క్లబ్ ప్రతినిధులు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఉదార నిర్ణయాన్ని అభినందించారు. కుటుంబ సభ్యులను నేత్రదానానికి ప్రోత్సహించిన కోల అన్నారెడ్డి, చింతల కిషన్, మ్యాదం శివకాంత్ పటేల్ కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు.




బాధిత కుటుంబానికి బాసటగా లయన్స్ క్లబ్

(ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) అక్టోబర్ 15:

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన ఉపసర్పంచ్ దాసరి కళ్యాణి –కొమురయ్య ల ఇళ్లు గత నాలుగు రోజుల క్రితం విద్యుత్ షాక్ సర్క్యూట్ తో కాలిపోగా, బాధిత కుటుంబానికి లయన్స్ క్లబ్ ఆఫ్ రాజారాంపల్లి బాసటగా నిలిచింది. రూ.16 వేల విలువ గల నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి, దుప్పట్ల ను గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారం సునీత- జలంధర్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ రాజరాంపల్లి అధ్యక్షులు లయన్ వన్నెల అంజనారెడ్డి, కార్యదర్శి లయన్ గడ్డం నంది రెడ్డి, కోశాధికారి లయన్ బి మురళి , ఫస్ట్ ప్రెసిడెంట్ లయన్ ఏలేటి చంద్రారెడ్డి , లయన్ టీ రమణారెడ్డి, చార్టెడ్ ప్రెసిడెంట్ లయన్ కుంట మల్లారెడ్డి, లయన్ ఏలేటి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రధాన రహదారిపై గుంతలు.. పట్టించుకోని అధికారులు!







- హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు వచ్చే మార్గంలోనే దుస్థితి.. వాహనదారులకు తప్పని ఇబ్బందులు

జక్కుల శ్రీకాంత్, కరీంనగర్, ప్రజాతీర్పు అక్టోబరు 15

:కరీంనగర్ నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. రహదారిపై పలుచోట్ల తారు దెబ్బతిని గుంతలు పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో గుంతల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు వచ్చే ప్రధాన మార్గంలోనే రహదారి పరిస్థితి ఇలా ఉంటే, నగరంలోని ఇతర రహదారుల పరిస్థితి ఎలా ఉందోనని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. నగరంలోకి ప్రవేశించే మార్గంలోనే రోడ్లు అధ్వానంగా కనిపిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై గుంతలు ఏర్పడినప్పటికీ సంబంధిత రోడ్లు భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రహదారులపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు గుంతలను తప్పించుకుంటూ వెళ్లాల్సి వస్తుండటంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి.

ప్రమాదాలు జరిగే వరకు వేచి చూస్తారా?

ప్రజల రాకపోకలకు కీలకమైన ప్రధాన రహదారులపై గుంతలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎన్టీఆర్ విగ్రహం సమీపంలోని రహదారికి మరమ్మతులు చేపట్టడంతో పాటు నగరంలోని ఇతర ప్రధాన రహదారుల పరిస్థితిని పరిశీలించి గుంతలను పూడ్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



దుర్గామాత నవరాత్రి ఉత్సవా కమిటీ ఆహ్వానం మేరకు అమ్మవారి దర్శనం చేసుకున్న

- బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

జగద్గిరిగుట్ట, అక్టోబర్ 15 ప్రజా తీర్పు

నియోజకవర్గం కైతలాపూర్ డివిజన్ ఆంజనేయులు నగర్ కాలనీ వద్ద దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఈ సందర్భంగా నాయకులు రవి మాట్లాడుతూ, దుర్గామాత అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖశాంతులు, సంతోషాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు...



హత్య స్థలాన్ని పరిశీలించిన డి.ఎస్.పి ... నాగేంద్ర చారి

ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 15 ప్రజా తీర్పు

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో బుధవారం రాత్రి జరిగిన హత్య కేసులో సీన్ రీ కన్స్ట్రక్షన్ లో భాగంగా సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి హత్య జరిగిన స్థలాన్ని గురువారం పరిశీలించారు ఆయన వెంట ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్ రమేష్ వీర్నపల్లి ఎస్సై లక్ష్మణ్ ఉన్నారు. ఈ సందర్భంగా డిఎస్పి మహేంద్ర చారి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల వారు స్థానికంగా అద్దెకు ఉండడానికి వస్తే వారి వివరాలు పోలీస్ స్టేషన్లో అందించాలని ఇంటి ఓనర్లకు సూచించారు. ఎల్లారెడ్డిపేట మండలంలో పురుగు రాష్ట్రాల నుండి వివిధ పనుల నిమిత్తం వచ్చి గ్రామాలలో కిరాయికి ఉండే వారి వివరాలకు సంబంధించిన అడ్రస్ వివరాలు స్థానిక పోలీస్ స్టేషన్లో తెలియజేయాలని డి.ఎస్.పి సూచించారు ఏదైనా సంఘటన జరిగితే అట్టి ఇంటి యజమానులు బాధ్యులవుతారని యజమానులు గ్రహించాలని డి.ఎస్.పి స్పష్టం చేశారు.



మంచిర్యాల:దుర్గామాత చండీ హోమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మేయర్ దంపతులు:

(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు,మంచిర్యాల) అక్టోబర్15

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32వ డివిజన్ రాంనగర్‌లో గల శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన చండీ హోమం కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ద ర్ని మధుకర్ దంపతులువారి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, చండీ హోమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆయురారోగ్యాలతో ఉండి మరింత కాలం ప్రజాసేవ చేయాలని, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు,భవానీ యూత్ సభ్యులు,కాలనీ వాసులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



బిజెపి లీగల్ సెల్ మండల అధ్యక్షునిగా రవిరాజు

(ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) అక్టోబర్ 15 :

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల భారతీయ జనతా పార్టీ అనుబంధ విభాగమైన లీగల్ సెల్ మండల అధ్యక్షునిగా మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన న్యాయవాది సట్ల రవి రాజు ను నియమిస్తున్నట్లు బిజెపి ధర్మపురి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు యాదవ్, ఎండపల్లి మండల అధ్యక్షులు రావు హన్మంతరావు తెలిపారు. ఈ మేరకు గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శులు పొన్నం నరేష్, బిజేవైఎం జిల్లా నాయకులు తిరుమల ప్రమోద్ గౌడ్, నాయకులు మేడిపల్లి రాజశేఖర్, మండల ఓబీసీ అధ్యక్షులు దివాకర్ గౌడ్ పాల్గొన్నారు.



గిర్ని బావి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పనిచేయని ఎయిర్ మెషిన్:

వాహనదారుల తీవ్ర అవస్థలు

నర్సంపేట రూరల్, గిర్ని బావి, ప్రజా తీర్పు ప్రతినిధి అక్టోబర్ 15

?పట్టణ సమీపంలోని గిర్ని బావి వద్ద గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో గాలి పంపే (ఎయిర్) మెషిన్ గత కొంతకాలంగా నిరుపయోగంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా దూరప్రాంతాలకు ప్రయాణించే వాహనదారులు, స్థానికులు ఇంధనం నింపుకోవడంతో పాటు టైర్లలో గాలి చెక్ చేసుకునేందుకు పెట్రోల్ బంక్‌లపైనే ఆధారపడతారు. అయితే ఈ బంక్‌లో ఎయిర్ మెషిన్ సరిగ్గా పనిచేయడం లేదని పలుమార్లు అక్కడి సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంక్‌కు వచ్చి ఇంధనం కొనుగోలు చేసినప్పటికీ, ఉచిత సౌకర్యమైన గాలి సదుపాయం అందకపోవడంతో అసంతృప్తి చెందుతున్నారు. ఈ విషయమై సంబంధిత పెట్రోల్ బంక్ యాజమాన్యం మరియు అధికారులు తక్షణమే స్పందించి, పాడైపోయిన ఎయిర్ యంత్రాంగానికి మరమ్మతులు చేయించి లేదా కొత్తది ఏర్పాటు చేసి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తాం..

- ప్రజా ప్రభుత్వంలో ప్రతి లబ్ధిదారున్ని ఆదుకుంటాం..
- జమ్మికుంట మండలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేసిన ప్రణవ్..

జమ్మికుంట అక్టోబర్ 15 ప్రజాతీర్పు



కష్ట సమయంలో పేదవారికి అండగా నిలిచి వారికి మేమున్నామనే భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.గురువారం రోజున మన ఊరు-మన కాంగ్రెస్-మన ప్రణవ్ కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట మండల పరిధిలోని మాచనపల్లి, జగ్గయ్యపల్లి,కోరపల్లి, విలాసాగర్,నగురం, వావిలాల,నాగంపేట, శాయంపేట, మడిపల్లి గ్రామాల్లో 8 లక్షల విలువ చేసే 17 చెక్కులను నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు.పరిస్థితి బాగోలేక ఆసుపత్రులపాలైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా ఆదుకుంటున్నామని,గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు వివిధ సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని వాటిని పరిష్కరించడానికి కృషిచేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా కష్ట సమయంలో అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి,ఇంచార్జి ప్రణవ్ బాబుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,మండల అధ్యక్షుడు,పట్టణ అధ్యక్షుడు,ప్రజా ప్రతినిధులు, బ్లాక్ కాంగ్రెస్,సీనియర్ నాయకులు, బీసీ,ఎస్సీ,మైనారిటీ, యూత్,యువజన సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవారి కృప ప్రజలందరిపై ఉండాలి..

నియోజకవర్గంలోని ప్రజలందరిపై దుర్గామాత అమ్మవారి కృప ఉండాలని,అమ్మవారి దయవల్ల నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు.జమ్మికుంట మండల పరిధిలోని గ్రామాల్లో దుర్గామాత మండపాలను దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చెన్నారావుపేటలో అట్టహాసంగా బతుకమ్మ వేడుకలు

నర్సంపేట రూరల్, చెన్నారావు పేట, ప్రజా తీర్పు ప్రతినిధి అక్టోబర్ 15

మండల కేంద్రంలోని పద్మావతి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకట శివానంద్ మరియు ఏపీఎం తిలక్ గౌడ్ మాట్లాడుతూ, మన తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనాదిగా వస్తున్న బతుకమ్మ పాటలను, సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని వారు పేర్కొన్నారు. ??అనంతరం గ్రామైక్య సంఘం ప్రాంగణంలో మహిళలంతా కలిసి బతుకమ్మ చుట్టూ చప్పట్లు కొడుతూ, భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆటపాటలు ఆడి అలరించారు. పూల బతుకమ్మలతో మహిళలు సందడి చేశారు.

??ఈ కార్యక్రమంలో వీవోఏ కుసుమ ఆమని, పద్మావతి సంఘం అధ్యక్షురాలు లక్క కీర్తన, ప్రధాన కార్యదర్శి ముదురు సుగుణ, ఉపాధ్యక్షురాలు కంది పూలమ్మ, కార్యదర్శి మహేశ్వరి, సహాయ కార్యదర్శి నిర్మల, సీసీలు మంజుల, సుజాత, అకౌంటెంట్ రజిత, కంప్యూటర్ ఆపరేటర్ ఉమా, సంఘ ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్లలో హమాలీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 15



ఎంఎల్ఎస్ పాయింట్లలో హమాలీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్లలో పని చేస్తున్న హమాలీలకు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ తో కలిసి హమాలీలకు దసరా బోనస్‌తో పాటు రెండు జతల యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదరపు కలెక్టర్ మాట్లాడుతూ హమాలీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి పండుగ బోనస్, యూనిఫాంలను అందించడం జరిగిందని, ఎంఎల్ఎస్ పాయింట్లలో విధులు నిర్వహిస్తున్న హమాలీల సేవలను గుర్తిస్తూ ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హత్య కేసులో అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు

- రిమాండ్ కు తరలింపు
- కూలీ డబ్బుల పంచాయతీ ప్రాణం తీసింది
- డిఎస్పీ నాగేంద్ర చారి

ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 15 ప్రజాతీర్పు

కూలి డబ్బుల విషయంలో మాట మాట పెరిగి హత్యకు దారి తీయగా హత్యకు పాల్పడిన ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు సిరిసిల్ల డి.ఎస్.పి నాగేంద్ర చారి వెల్లడించారు. గురువారం ఎల్లారెడ్డిపేట సర్కిల్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి మాట్లాడుతూ ఆగ్రా కు చెందిన పవన్ మార్బుల్ కార్మికుడిగా పనిచేస్తూ గొల్లపల్లిలో నివాసము ఉంటున్నాడు. కాగా ఇతనితో పాటు మొత్తం ఐదుగురు కూలీలు నివాసం ఉంటున్నారు. కాగా కూలి డబ్బుల విషయంలో వంశీ, జోగిందర్ కు పవన్ కు మధ్య ఘర్షణ జరిగింది. వీలు డబ్బుల విషయంలో ఘర్షణ జరుగగా ఇంట్లో ఉన్న కత్తితో పవన్ మెడపై, చాతి పై కత్తితో దాడి చేసి చంపేశారు నిందితుల్లో ఒకరైన జోగేందర్ మృతుడు పవన్ కు మేన బావమరిది కావడం విశేషం. పవన్ ను చంపిన నిందితులు పవన్ కు సంబంధించిన ద్విచక్ర వాహనం తీసుకొని పరారయ్యారు. నిందితులు పవన్ను చంపి పారిపోతుండగా వీరిని పట్టుకోవడానికి వీర్నపల్లి ఎస్సై లక్ష్మణ్ ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్ రమేష్ ల ఆధ్వర్యంలో పోలీసులు నిందితుల కోసం గాలించారని డి.ఎస్.పి తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు కరీంనగర్ సుల్తానాబాద్ రామగుండం పోలీసులను అప్రమత్తం చేసి వీరు స్వస్థలానికి వెళ్లే క్రమంలో రామగుండం రైల్వే స్టేషన్ వద్ద ఉండగా పట్టుకున్నట్లు తెలిపారు. హత్యకు పాల్పడిన నిందితులను 12 గంటల్లోపే పట్టుకున్న ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓదెల వెంకటేష్ ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్. రమేష్ వీర్నపల్లి ఎస్సై లక్ష్మణ్ లను డి.ఎస్.పి అభినందించారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన ఎల్లారెడ్డిపేట సీఐ ఎస్ఐ వీర్నపల్లి ఎస్సై లకు రివార్డులు అందించాలని కోరుతూ జిల్లా ఎస్పీ మహేష్ బి గితే కు సిఫారస్ చేయనున్నట్లు తెలిపారు. అద్దెకు ఇచ్చే యజమానులు పలు జాగ్రత్తలు పాటించాలి ఎల్లారెడ్డిపేట మండలంలో పలు గ్రామాలలో పొరుగు రాష్ట్రాల నుండి వచ్చే వారి పూర్తి వివరాలు తీసుకున్న తర్వాతనే వారికి ఇండ్లు అద్దె కివ్వాలని వారికి సంబంధించిన పూర్తి సమాచారం స్థానిక పోలీస్ స్టేషన్లో అందించాలని డిఎస్పి కోరారు. పొరుగు రాష్ట్రాల నుండి వచ్చి ఇక్కడ ఏదైనా దొంగతనాలు కానీ, హత్యలకు కానీ పాల్పడితే వారికి ఇండ్లు కిరాయికి ఇచ్చిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని డిఎస్పి హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎల్లారెడ్డిపేట సీఐ ఓదెల వెంకటేష్ ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్ రమేష్ వీర్నపల్లి ఎస్సై లక్ష్మణ్ , హెడ్ కానిస్టేబుల్ షబ్బీర్, కానిస్టేబుళ్లు పరశురామ్ బాబు ,పాల్గొన్నారు.

పాశ మైలారం పారిశ్రామిక వాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో పాదయాత్ర

- చట్టం ప్రకారం కార్మికులకు బోనస్ ఇవ్వాలి
- పెరిగిన ధరల అనుగుణంగా శాస్త్రీయంగా కనీస వేతనాలను పెంచాలి
- సిఐటీయు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

పటాన్ చెరు రూరల్, అక్టోబరు 15 ప్రజా తీర్పు



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికుల శ్రమ దోపిడికి యాజమాన్యాలు పాల్పడుతున్నయాని, జీవో నెంబర్ 6 ప్రకారం కనీస వేతనాలను యాజమాన్యాలు అమలు చేయాలని, చట్టం ప్రకారం బోనస్ ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 42000/- పెంచాలని సిఐటీయు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు డిమాండ్ చేశారు.. ఈరోజు పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్ లో సిఐటీయు ఆధ్వర్యంలో ఇస్నాపూర్ ఎక్స్ రోడ్ వరకు పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ పాదయాత్రలో ముఖ్య అతిథిగా సిఐటీయు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కనీస వేతనాలను సవరిస్తూ జీవో నెంబరు.6ను రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా విడుదల చేసిందని తెలిపారు.ఈ పెరిగిన వేతనాలను 2026 జూన్ ఒకటో తేదీ నుండి అమలు చేయాలని ఉన్నప్పటికీ అమలు చేయకుండా కార్మికులను శ్రమదోపిడికి యాజమాన్యాలు పాల్పడుతున్నాయని అన్నారు. సిఐటీయు యూనియన్లు ఉన్న పరిశ్రమల్లో పెరిగిన కనీస వేతనాలు అమలు చేయించడం జరుగుతుందని, ఇంకా అనేక పరిశ్రమల్లో అమలు కావడంలేదని అమలు చేయించవలసిన కార్మిక శాఖ ప్రభుత్వ అధికార యంత్రం పట్టించుకోవడంలేదన్నారు. కనీస వేతనాలకు కంటే ఎక్కువ ఉన్నా సరే వాటి పైన 10 శాతం వేతనాలు పెంచాలని జీవోలో ఉందని తెలియజేశారు. కనీస వేతనాలను శాస్త్రీయంగా సవరించకపోగా ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించిందని అన్నారు. కుటుంబ అవసరాలు, జీవన వ్యయం, వినియోగదారుల ధరల సూచీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని అన్నారు. కనీస వేతనాలను శాస్త్రీయంగా సవరించి రూ.42,000/-లుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు జీవో నెం.6 ప్రకారం కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని, దసరా పండుగకు బోనస్ చట్టం ప్రకారం ఇవ్వాలని, చట్టబద్ధమైన ఈఎస్ఐ పిఎఫ్ ఓటి డబుల్ ఇయల్స్ సెలవులు వంటివి అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులు సంఘటితంగా పోరాడి సాధించుకోవాలనే అన్నారు. అక్టోబర్ 25న పారిశ్రామిక కార్మికులతో చలో హైదరాబాద్, డిసెంబర్ 1 2 3 తేదీలలో ఢిల్లీ ఆక్యుపై నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ఆందోళన పోరాటాల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని హెల్పునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ సిఐటీయు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్, సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు పి. పాండురంగారెడ్డి, కిర్బి యూనియన్ జనరల్ సెక్రెటరీ వీఎస్ రాజు, శాండ్విక్ జనరల్ సెక్రెటరీ ప్రదీప్, నాయకులు తలారి శ్రీనివాస్ రాజు వెంకటేష్ మల్లేష్ సుధాకర్ శ్యామ్ ఎడుకొండల్ విట్టల్ సోమన్న రాజురెడ్డి శంకర్ బిలాల్ వెంకట్రావు సత్తిబాబు నారాయణ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు..


బీరంగూడలో వైభవంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్

పఠాన్ చెరు /అమీన్‌పూర్, ప్రజా తీర్పు అక్టోబర్ 15

బీరంగూడ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, వందనపురి కాలనీలలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించరు ఈ ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు జరిగిన వేడుకలకు అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలలో కొలువుదీరిన అమ్మవార్లను దర్శించుకుని, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు నందారం నరసింహ గౌడ్ ని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ "చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా శరన్నవరాత్రులు మన సంస్కృతీ సంప్రదాయాలకు నిదర్శనం. లోక కళ్యాణార్థం దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం అవతరించిన జగన్మాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి. రాఘవేంద్ర కాలనీ, వందనపురి కాలనీల ప్రజలు కలిసికట్టుగా, భక్తిభావంతో ఇంత వైభవంగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం ఎంతో అభినందనీయం. నవరాత్రులలో అమ్మవారిని ఆరాధించడం వల్ల మానసిక ప్రశాంతత, సకల శుభాలు



చేకూరుతాయి. భవానీ దేవి కటాక్షంతో డివిజన్ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థించాను. కాలనీల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఎల్లవేళలా నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాఘవేంద్ర కాలనీ ప్రెసిడెంట్ మల్లేష్, వైస్ ప్రెసిడెంట్ జనార్దన్ రెడ్డి, ట్రెజరర్ గోపి, శంకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి,కాలనీ వాసులు ఉత్సవ కమిటీ నిర్వాహకులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ నిర్వహించారు.



అంకిరెడ్డి చిట్టెమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

చంద్రుగొండ, అక్టోబర్ 15 ప్రజా తీర్పు

చంద్రుగొండ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ అంకిరెడ్డి కృష్ణారెడ్డి మాతృమూర్తి అంకిరెడ్డి చిట్టెమ్మ దశదిన కర్మ కార్యక్రమానికి పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, కొత్తగూడెం సొసైటీ అధ్యక్షుడు మండే వీర హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆళ్ల మురళి, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడు ఎర్రమల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని చిట్టెమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోమారి రవీందర్, గుగులోత్ కోటేష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి మిరియాల ప్రీతమ్, మిరియాల రాఘవరావు జన్మదిన శుభాకాంక్షలు

శేరిలింగంపల్లి, అక్టోబరు 15 ప్రజా తీర్పు



ప్రజలతో ఆత్మీయ అనుబంధాన్ని కలిగి, చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజాసేవలో ముందుండే ప్రజానాయకుడు, శేరిలింగంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు, పీఏసీ చైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీ జన్మదినం సందర్భంగా మిరియాల ప్రీతమ్ మిరియాల రాఘవరావు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ నివాసానికి వెళ్లి, గజమాలతో ఘనంగా సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు మరింత సేవలందిస్తూ, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో చిరకాలం ప్రజాజీవితంలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విష్ణుమూర్తి, జగన్నాథరావు, చలం, కృష్ణ, త్రినాథ్, ప్రసాద్, పరదేశి నాయుడు, శ్యామల రావు, వెంకట్రావు, విష్ణు, సాయి, త్రిలోచన్ తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారాలకు ఊరట.. సులభతర పన్నుల వ్యవస్థ: హైదరాబాద్‌లో సీబీఐసీ చైర్మన్

వినోద్, ప్రజా తీర్పు, హైదరాబాద్, అక్టోబర్ 15

హైదరాబాద్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో 57వ జీఎస్టీ కౌన్సిల్ సంస్కరణలను వెల్లడించిన సీబీఐసీ చైర్మన్ వివేక్ చతుర్వేది. ?సారంశం: నిజాయితీగా పన్నులు చెల్లించే వారికి ఇబ్బందులు లేకుండా 'తదుపరి తరం' ప్రక్రియాపరమైన సంస్కరణలను జీఎస్టీ మండలి తీసుకొచ్చిందని, పన్నుల పరిపాలన వ్యవస్థ వ్యాపారాలకు ఆర్థిక భాగస్వామిగా మారాలని కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) చైర్మన్ శ్రీ వివేక్ చతుర్వేది స్పష్టం చేశారు.

ప్రధాన అంశాలు:

?అరెస్టులు, ప్రాసిక్యూషన్‌పై సడలింపులు: జీఎస్టీ చట్టంలో అరెస్టులకు సంబంధించిన కఠిన నిబంధనలను తొలగించడమే కాకుండా, ప్రాసిక్యూషన్‌కు వర్తించే కనీస పరిమితిని పెంచారు. స్వయంచాలిత రిఫండ్‌లు (ఆటోమేటెడ్ రీఫండ్ సిస్టమ్): మానవ ప్రమేయాన్ని తగ్గిస్తూ ఆటోమేటెడ్ వ్యవస్థ ద్వారా వేగంగా రిఫండ్‌లు అందించనున్నారు.వాహనాల తనిఖీలపై కఠిన నిబంధనలు: నిర్దిష్టమైన నిఘా సమాచారం ఉంటేనే వాహనాలను తనిఖీ చేయాలి. అది కూడా సరుకు బయలుదేరే మరియు చేరుకునే రాష్ట్రాల్లో జాయింట్ కమిషనర్ లేదా అంతకంటే పైస్థాయి అధికారి ముందస్తు అనుమతితో మాత్రమే నిర్వహించాలి. కేంద్రీకృత జీఎస్టీ పరిపాలన: కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే పన్ను చెల్లింపుదారుల కోసం జీఎస్టీ పరిపాలనను కేంద్రీకృతం చేసే ప్రతిపాదనపై పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను కోరారు. వికసిత్ భారత్ 2047: 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ సాధనలో జీఎస్టీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. కార్యక్రమ విశేషాలు: ?హాజరైన ప్రముఖులు: సీబీఐసీ చైర్మన్ వివేక్ చతుర్వేది, సభ్యుడు (జీఎస్టీ) సంజయ్ మంగళ్, హైదరాబాద్ సీజీఎస్టీ జోన్ చీఫ్ కమిషనర్ అరుణ్ కుమార్. భాగస్వామ్యం: ఎంఎస్ఎంఈలు, ఈ-కామర్స్, ఎగుమతిదారులు, స్టార్టప్‌లు మరియు వివిధ వాణిజ్య మండళ్లకు చెందిన సుమారు 250 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. పరిశ్రమల స్పందన: వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసేలా మరియు వర్కింగ్ క్యాపిటల్ లభ్యతను పెంచేలా ఉన్న జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలను వాణిజ్య, పారిశ్రామిక రంగాలు స్వాగతించాయి.

రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు కేంద్రంగా పటాన్చెరు





పటాన్చెరు అక్టోబర్ 15 ప్రజా తీర్పు

పటాన్చెరు నియోజకవర్గ కేంద్రాన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రతి విద్యార్థి దైనందిన జీవితంలో క్రీడలు భాగం కావాలని, క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల అలవడతాయని పేర్కొన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో నిర్వహిస్తున్న 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలబాలికల రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలను గురువారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణితో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాలకు చెందిన 200 మందికి పైగా క్రీడాకారులు పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. హాజరైన క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. క్రీడాకారులకు అవసరమైన మైదానాలు, వసతులు, ఇతర సౌకర్యాలను కల్పిస్తూ పటాన్చెరును క్రీడా రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. క్రీడలు, క్రీడాకారులకు తన సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో జాతీయ స్థాయి క్రీడా పోటీలకు సైతం ఆతిథ్యం ఇవ్వబోతున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు పోలీసుల బందోబస్తు ఏదీ?

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల నిర్వహణకు తగిన పోలీసు బందోబస్తు కల్పించడంలో పటాన్చెరు పోలీసులు ఘోరంగా విఫలమయ్యారని ఎమ్మెల్యే జిఎంఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్‌లు, నిర్వాహకులు హాజరయ్యే ఇలాంటి ప్రతిష్టాత్మక పోటీలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. క్రీడా కార్యక్రమాల పట్ల పోలీసులు తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు. క్రీడాకారులకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన సమయంలో బందోబస్తు విషయంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర డీజీపీతో పాటు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాల నిర్వహణలో పోలీసు శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

క్రీడాకారులకు అండగా ఎమ్మెల్యే జిఎంఆర్..

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు హాజరైన క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలను తన సొంత నిధులతో ఏర్పాటు చేయడం ద్వారా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి క్రీడల పట్ల తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేపట్టారు. పటాన్చెరులో క్రీడా మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేసి, స్థానిక క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల ప్రారంభంతో పటాన్చెరు మైత్రి మైదానం క్రీడా సందడితో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్ నాయక్, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, పృథ్వీరాజ్, అశోక్, వెంకటేష్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



శిల్పారామంలో బతుకమ్మ వేడుకలు, ఆది బజార్ సందడి..

శేరిలింగంపల్లి, అక్టోబరు 15 ప్రజా తీర్పు

శిల్పారామం మాదాపూర్ లో బతుకమ్మ పండుగ సందర్భంగా శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మలను పేర్చి, సాయంత్రం సందర్శకులతో కలిసి బతుకమ్మ ఆట ఆడుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఒడిస్సీ నృత్య ప్రదర్శనలో శ్రీమతి భీతిక మిశ్రీ బృందానికి చెందిన కళాకారులు ప్రతీక్ష, సుమతి, కృతిలు మంగళ చరణ్, దుర్గా స్తుతి, మోక్ష అంశాలను ప్రదర్శించారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఉత్తిష్ఠ ఎన్సెంబుల్ కళాకారులు శ్రేయ, శ్రావ్య, పార్థవి, తపతి, సహిష్ణులు గజానన కౌతం, రామాయణ శబ్దం, భైరవి, లక్ష్మీ ప్రవేశం, కులుకగా నడవరో, అమ్మ ఆనందదాయని అంశాలను ప్రదర్శించి మెప్పించారు. ఆది బజార్ ట్రైబల్ మేళాలో తెలంగాణ బంజారా జ్యువెలరీ, రాజస్థాన్ బెడ్‌షీట్స్, చున్నీలు, లడఖ్ సిల్క్ పష్మీనా శాలువాలు, స్టోల్స్, అంగోరా ఉన్ని ఉత్పత్తులు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి.



దుర్గామాతను దర్శించుకున్న బీఆర్ఎస్ నేత గొల్లూరి అంజయ్య

ఘనంగా నవరాత్రి పూజలు, అన్నదాన కార్యక్రమంలో భాగస్వామ్యం

వినోద్, ప్రజా తీర్పు, ?ఉప్పల్ / హెచ్‌బి కాలనీ, అక్టోబర్ 15

?ఉప్పల్ నియోజకవర్గం, హెచ్‌బి కాలనీ డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ ఇందిరా నగర్ కమాన్ మరియు నవోదయ నగర్ ప్రాంతాలలో కొలువైన శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గామాత మండపాలలో దసరా శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా గురువారం నిర్వహించిన విశేష పూజా కార్యక్రమాలలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యులు, డివిజన్ మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ?ప్రత్యేక పూజలు: అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించిన ఆయన, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ?ఆకాంక్షలు: దుర్గామాత ఆశీస్సులతో ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజల జీవితాల్లో ఈ పండుగ వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. భక్తి భావనను పెంపొందించేలా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ?అన్నదాన వితరణ: పూజల అనంతరం ఇందిరా నగర్ కమాన్ మరియు నవోదయ నగర్ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో గొల్లూరి అంజయ్య స్వయంగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ?ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని

మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్

నర్సంపేట అక్టోబర్ 15 ప్రజా తీర్పు ప్రతినిధి

దుర్గామాత అమ్మవారి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నర్సంపేట మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు గాంధీ నగర్ జనతా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం లక్ష్మీరామానంద్ , స్థానిక 20వ వార్డు కౌన్సిలర్ శ్రీరామోజు రోజా రాణి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అయ్యగారు వేద ఆశీర్వాదాలు అందించడం జరిగింది, అంతరం మున్సిపల్ చైర్ పర్సన్ ని శాలువాలతో సత్కరించిన మహిళ సోదరీమణులు.. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.. ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ ఇస్లావత్ రామాగోపి నాయక్, ఫైండ్ల పవన్, బూస స్నేహిత్, కొండోజు చరణ్, కొల్లూరి రాజు, కొల్లూరి భరత్, కొండోజు సురేష్, సాంబరాజు సుమన్, హరిదాస్యం స్వాతి, తోగిటి సృజన, అడ్డూరి స్వర్ణలత, తెలంగాణ రజిత, కొల్లూరి సిరి, తదితరులు పాల్గొన్నారు..

బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా మద్దెర్ల శ్రీనివాస్

వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 15



బీజేపీ మంచిర్యాల జిల్లా కార్యాలయంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా బెల్లంపల్లి కి చెందిన మద్దెర్ల శ్రీనివాస్ ను నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్, ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖేష్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు అశోక్ వర్ధన్ చేతుల మీదుగా నియామక పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పట్టి వెంకటకృష్ణ,జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మద్దెర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో బిజెపి ఓబీసీ మోర్చా బలోపేతానికి పనిచేస్తానని తెలిపారు.

సైదాపూర్ మండల గులాబి రథసారథిగా చెల్మల రాజేశ్వర్ రెడ్డి

ప్రధాన కార్యదర్శిగా రవీందర్ గౌడ్

హుజురాబాద్ అక్టోబర్ 15 ప్రజాతీర్పు ప్రతినిధి



బి ఆర్ ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి అంకితభావంతో నిబద్ధతతో పనిచేస్తున్న నాయకుడు, సైదాపూర్ మండలం ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన చెల్మల రాజేశ్వర్ రెడ్డి మండల బి ఆర్ ఎస్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. సైదాపూర్ మండల టిఆర్ఎస్ సమావేశం గురువారం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ హాజరయ్యారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుండి గులాబీ పార్టీ నాయకులు కార్యకర్తలు మాజీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. మండల అధ్యక్షునిగా రాజేశ్వర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు. దీంతో సమావేశంలో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి.

రాజేశ్వర్ రెడ్డి ప్రస్థానం ఇది..

ఎక్లాస్పూర్ గ్రామానికి చెందిన రాజేశ్వర్ రెడ్డి కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉంది. ఆయన తండ్రి గతంలో సర్పంచ్ గా పనిచేశారు. గ్రామం తో పాటు మండలంలో రాజేశ్వర్ రెడ్డికి సౌమ్యుడు అనే పేరు ఉంది. ఉన్నత విద్యావంతునిగా ఉన్నాడు. బి ఆర్ ఎస్ ఆవిర్భావం నుండి పార్టీలో విద్యార్థి విభగమైన టి ఆర్ ఎస్ వి నాయకునిగా పనిచేశాడు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించాడు. నాడు జరిగిన ఆందోళనలో పాల్గొన్నారు. అన్ని గ్రామాల నాయకులతో కార్యకర్తలతో అన్ని వర్గాల ప్రజలతో రాజేశ్వర్ రెడ్డి కి మంచి సంబంధాలు ఉన్నాయి. రాజేశ్వర్ రెడ్డి కి మంచి పేరు ఉండడంతో పాటు యువ నాయకుడు కావడంతో అలాగే అందరినీ కలుపుకొని పోయే స్వభావం ఉండడంతో ఆయనను అధ్యక్షునిగా నియమించాలని నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ నిర్ణయించినట్టు సమాచారం.

బలోపేతంకానున్న పార్టీ

మండల టిఆర్ఎస్ అధ్యక్షునిగా చెల్మల రాజేశ్వర్ రెడ్డి నియామకంతో మండలంలో పార్టీ మరింత బలోపేతం కానుంది. నిజానికి సైదాపూర్ మండలంలో గులాబీ పార్టీకి మంచి పట్టు ఉంది. ఏ పార్టీకి లేని నాయకులు కార్యకర్తలు గులాబీ పార్టీకి ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలు కూడా సమీపిస్తున్న తరుణంలో రాజేశ్వర్ రెడ్డి నియామకంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఇదొక మంచి పరిణామం అని యువనేతకు పగ్గాలు అప్పగించడంతో పార్టీకి పూర్తిస్థాయిలో జీవసత్వాలు తీసుకువచ్చి ఎమ్మెల్యే సహకారంతో, పార్టీ శ్రేణుల సమన్వయంతో సైదాపూర్ ను గులాబీ పార్టీకి పెట్టని కోటగా తీర్చిదిద్దుతారని యువ నేతలు అభిప్రాయపడుతున్నారు. రాజేశ్వర్ రెడ్డి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమన్వయం ఎంతో ముందుకు వెళ్తా : కొత్త మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు చల్మల రాజేశ్వర్ రెడ్డి

పార్టీ శ్రేణుల సహకారంతో, సమన్వయంతో, మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ సూచనలతో పార్టీని ముందుకు తీసుకు వెళ్తానని కొత్త అధ్యక్షుడు చల్మల రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. బి ఆర్ ఎస్ మండల నూతన అధ్యక్షునిగా ఎన్నికైన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తనకు అవకాశం ఇచ్చిన పార్టీ నాయకులకు కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ కు కృతజ్ఞతలు ఆయన తెలిపారు. తన గొప్ప అవకాశం లభించిందని, బాధ్యత కూడా పెరిగిందని తెలిపారు. అన్ని సామాజిక వర్గాలను, యువతను, మహిళలను అందరినీ కలుపుకొని పార్టీని బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని రైతులు ప్రజలు గ్రామాల్లో గోసపడుతున్నారని ఆయన అన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా కెసిఆర్ వైపు ప్రజలు చూస్తున్నారని, నాటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిందని అన్నారు. సతీష్ కుమార్ మరోసారి హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందుతారని, ఆయన హయాంలో చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ హయాంలో జరిగిందేమీ లేదని విమర్శించారు. ఆయన గెలుపు కోసం నిరంతరం సైనికుల్లా పనిచేస్తామని, అలాగే కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు తీసుకువస్తామని, నాకు పార్టీ శ్రేణులు సహకరించాలని ఆయన కోరారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ నిర్లక్ష్యంతోనే వ్యక్తి మృతి

- ఇంజెక్షన్ వికటించి ప్రాణాలు పోయాయని కుటుంబ సభ్యుల ఆరోపణ

జమ్మికుంట, అక్టోబర్ 15 ప్రజాతీర్పు



జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన తండ్రి మృతి చెందారని మృతుడి కుమారుడు శివకృష్ణ ఆరోపించారు. బాధ్యులైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన కొప్పుల సమ్మయ్య (50) వారం రోజుల క్రితం శస్త్రచికిత్స నిమిత్తం పట్టణంలోని కార్తికేయ ఆసుపత్రిలో చేరారు. చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు ఇంటికి వెళ్లారు. అయితే, రెండు రోజుల క్రితం శస్త్రచికిత్స చేసిన ప్రాంతంలో ఇన్ఫెక్షన్ రావడంతో తిరిగి అదే ఆసుపత్రిలో చేరారు. ఈ క్రమంలో బుధవారం వైద్యులు ఆయనకు యాంటీబయోటిక్ ఇంజెక్షన్ ఇచ్చారని, గురువారం ఆయనకు గుండెపోటు రావడంతో ప్రాథమికంగా సీపీఆర్ చేసి మెరుగైన చికిత్స కోసం హనుమకొండలోని మాక్స్‌కేర్ ఆసుపత్రికి తరలించారని కుటుంబ సభ్యులు తెలిపారు. అక్కడి వైద్యులు పరీక్షించి సమ్మయ్య మృతి చెందినట్లు నిర్ధారించారని పేర్కొన్నారు.వైద్యుల నిర్లక్ష్యపూరిత చికిత్స, తప్పుడు ఇంజెక్షన్ కారణంగానే తమ తండ్రి ప్రాణాలు కోల్పోయారని శివకృష్ణ ఆరోపించారు. మృతదేహాన్ని తిరిగి జమ్మికుంటలోని కార్తికేయ ఆసుపత్రికి తీసుకువచ్చి మీడియా ఎదుట తన ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగులు, వృద్ధులకు పరికరాల పంపిణీ పై అధికారులు దృష్టి సారించాలి

హుస్నాబాద్ అక్టోబర్ 15 రవీందర్ ప్రజా తీర్పు



నియోజకవర్గంలో అలింకో అధ్వర్యంలో అడిప్ పథకం కింద దివ్యాంగులు, వృద్ధులకు సహాయక పరికరాల పంపిణీ కోసం ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ప్రత్యేక శిబిరాల నిర్వహణపై సమాచారం క్షేత్రస్థాయి వరకు చేరిందా? అనే అంశాలపై మంత్రి అధికారులను ఆరా తీశారు. గురువారం అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన మంత్రి...గ్రామాల్లో డప్పు చాటింపుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు అందించే సహాయక పరికరాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఒక్క అర్హులైన లబ్ధిదారుడు కూడా మిస్ కాకుండా గుర్తించి, ప్రతి ఒక్కరికీ సహాయక పరికరాలు అందేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాలో రెండు మండలాలకు ఒక రోజు, హనుమకొండ జిల్లాలో రెండు మండలాలకు ఒక రోజు, సిద్దిపేట జిల్లాలో మూడు మండలాలకు రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. శిబిరాల నిర్వహణకు ముందుగానే అర్హులైన లబ్ధిదారుల వివరాలను సేకరించి పూర్తి స్థాయి డేటా సిద్ధం చేయాలని తెలిపారు. అర్హులైన వారందరూ శిబిరాలకు హాజరయ్యేలా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్డీఓ, పీడీ, డీడబ్ల్యూఓలతో పాటు జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు ఈ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయక పరికరాలు అందించడంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

24 గంటల్లోనే పోగొట్టుకున్న రూ.30 వేల నగదును గుర్తించిన పోలీసులు

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో



భూపాలపల్లి జిల్లా బస్టాండ్ సమీపంలో పోగొట్టుకున్న రూ.30 వేల నగదును పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా గుర్తించి బాధితుడికి తిరిగి అందజేశారు. నాచారం గ్రామానికి చెందిన మేకల రాజు నగదును పోగొట్టుకోగా, భూపాలపల్లి పోలీసులు 24 గంటల్లోనే గుర్తించి ఆయనకు అప్పగించారు. భూపాలపల్లి సీఐ శ్రీనివాస్ బాధితుడు మేకల రాజుకు రూ.30 వేల నగదును అందజేశారు. తక్కువ సమయంలో నగదును గుర్తించి తిరిగి అప్పగించడంతో బాధితుడికి ఊరట లభించింది. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణతో పాటు పోగొట్టుకున్న వస్తువులు, నగదును గుర్తించడంలోనూ సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. సీసీ కెమెరాల ఫుటేజీ సహాయంతోనే ఈ నగదును త్వరగా గుర్తించగలిగామని పేర్కొన్నారు. ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సముదాయాలు, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భద్రతకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. పోలీసుల వేగవంతమైన చర్యలను భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ అభినందించారు.



సహకార రంగ అభివృద్ధికి కొత్త నాయకత్వం

నిజాంసాగర్ /అక్టోబర్ 15(ప్రజాతీర్పు):

నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట, మల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) నూతన చైర్మన్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం గోర్గల్ సొసైటీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. అచ్చంపేట చైర్మన్‌గా పట్లోళ్ల జనార్దన్ రెడ్డి, మల్లూరు చైర్మన్‌గా భుజంగారి వినోద వెంకట్రామిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన చైర్మన్లకు శుభాకాంక్షలు తెలిపారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ, రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వర్ధన్నపేట ఎస్‌హెచ్‌ఓగా భోగం ప్రవీణ్ బాధ్యతల స్వీకరణ

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో



వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఓ)గా సబ్ ఇన్‌స్పెక్టర్ భోగం ప్రవీణ్ గురువారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. పర్వతగిరి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఆయన, బదిలీపై వర్ధన్నపేటకు వచ్చారు. పర్వతగిరి నుంచి వర్ధన్నపేటకు బదిలీ పర్వతగిరిలో విధులు నిర్వహించిన సమయంలో భోగం ప్రవీణ్‌కు స్థానిక నాయకులు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఆయన తదుపరి బాధ్యతలను వర్ధన్నపేటలో స్వీకరించడంతో పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల నిర్వహణపై ఆసక్తి నెలకొంది. శాంతిభద్రతల పరిరక్షణే కీలకం వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రత పోలీసుల విధుల్లో కీలకమైన అంశాలు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌హెచ్ఓ ఆధ్వర్యంలో పోలీస్--ప్రజల మధ్య సమన్వయం, ఫిర్యాదుల పరిష్కారం, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఉండనుంది.

ప్రజల సహకారంతో మెరుగైన పోలీసింగ్

పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించే బాధితులకు సత్వర స్పందన అందించడం, ప్రజల సమస్యలను పరిష్కరించడం, నేరాల నివారణకు చర్యలు చేపట్టడం వంటి అంశాలు కొత్త అధికారికి కీలక బాధ్యతలుగా నిలవనున్నాయి.

పంచాయతీ రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: డీపీఓ కొమ్మెర సతీష్

(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజా తీర్పు తాండూర్ మండలం రిపోర్టర్) అక్టోబరు 15



యాప్ తనిఖీల్లో భాగంగా డివిజనల్ పంచాయతీ అధికారి కొమ్మెర సతీష్ తాండూర్ మండలంలోని ద్వారకాపూర్, కాసిపేట గ్రామ పంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. పంచాయతీ స్టాట్యూటరీ రికార్డులు, నీటి సరఫరా రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువలను నిరంతరం శుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ట్రాక్టర్ ద్వారా ప్రతిరోజూ చెత్తను సేకరించి, తడి, పొడి చెత్తను వేరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కంపోస్ట్ షెడ్‌లో క్రమం తప్పకుండా కంపోస్ట్ తయారయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని చేతిపంపులు, మోటార్ల వద్ద వీబీ-జీ-రామ్-జీ కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ సోక్ పిట్లను నిర్మించాలని సూచించారు. అదేవిధంగా అక్టోబర్‌లోపు ఇంటి పన్నును 100 శాతం వసూలు చేసి, సంబంధిత గ్రామపంచాయతీ ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ద్వారకాపూర్ సర్పంచ్ మసాడి తిరుపతి, కాసిపేట సర్పంచ్ ముదాం వనజ, పంచాయతీ కార్యదర్శులు కార్తీక్, భీమయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా పాలనలో రోడ్లపై ప్లాస్టిక్ కవర్లా?

పట్టించుకోని పాలకవర్గం, స్పందించని శానిటరీ ఇన్స్పెక్టర్

హుస్నాబాద్ అక్టోబర్15 రవీందర్ ప్రజా తీర్పు



ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా హుస్నాబాద్ ను తీర్చిదిద్దడానికి హుస్నాబాద్ శాసనసభ్యులు, మంత్రి పొన్నం ప్రభాకర్ ఒకవైపు కృషి చేస్తుంటే మరోవైపు మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్లపై ప్లాస్టిక్ కవర్లు చెల్లార్చుదురుగా పడి ఉండడంతో పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు యూస్ చేసిన దుకాణదారులపై మున్సిపల్ అధికారులు ఏమాత్రం ఆలోచించకుండా ఫైన్ వేసి వారి వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తున్నారు. ఇదే రకంగా హుస్నాబాల్ పట్టణంలోని ప్రధాన రహదారిపై వేసిన కవర్లను ఎందుకు నివారించలేకపోతున్నారు అని పట్టణ ప్రజలు అనుకోవడం గమనార్హం. ప్రధాన రహదారి గూండా వెళ్లే వాహనదారులు ప్లాస్టిక్ కవర్లను చూస్తూ ప్లాస్టిక్ కవర్లు వాడినందుకు దుకాణదారుల వద్ద ఫైన్లు వేసే మున్సిపల్ అధికారులు అదే చిత్తశుద్ధిని రోడ్లపై వేసే కవర్లను తీసి వేయించడంలో గాని ఎందుకు చూపించలేకపోతున్నారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు? నేషనల్ హైవే డివైడర్ల మధ్య చెట్ల పేరుతో తీసుకువచ్చిన ప్లాస్టిక్ సంచిలను మొక్కలు నాటిన అనంతరం మిగిలిన కవర్లను రోడ్లపై వేయడం వల్ల రోడ్లన్నీ చెత్తకుండీలుగా మారి చూడడానికి రోడ్లు అసహ్యకరంగా కనిపిస్తున్నాయని పట్టణవాసులు అనుకుంటున్నారు. మొక్కలు నాటుకుంటూ నిర్లక్ష్యంగా రోడ్ల పైన వేస్తున్న ప్లాస్టిక్ కవర్లను, వేయించే సదర్ కాంట్రాక్టర్ పై జరిమానా విధించి రసీదును ప్రజలకు చూపించాలని డిమాండ్ చేస్తున్నారు. గత రెండు మూడు రోజుల నుండి డివైడర్ల మధ్య మొక్కలు నాటుకుంటూ రోడ్డుకు ఇరువైపులా కవర్లు వేసి దుర్గంధ భరితంగా మారుస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం..

- సరైన పత్రాలు లేదా నంబర్ ప్లేట్లు లేని 24 వాహనాలు గుర్తింపు
- గంజాయి, అక్రమ మద్యం నిర్మూలనపై ప్రత్యేక నిఘా..
- ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన
- ప్రజల భద్రతే లక్ష్యంగా గ్రామాల్లో విస్తృత తనిఖీలు

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో



మహబూబాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో గూడూరు సర్కిల్ పరిధిలోని కొత్తగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌతుగూడెం, చింతగట్టు తండా గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 35 మంది పోలీసు సిబ్బంది పాల్గొని సుమారు 120 ఇళ్ల పరిధిలో తనిఖీలు చేపట్టారు. వాహనాలను తనిఖీ చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై ఆరా తీశారు. సరైన పత్రాలు లేదా నంబర్ ప్లేట్లు లేని 24 వాహనాలను గుర్తించారు. అలాగే 15 లీటర్ల అక్రమ మద్యం (గుడుంబా), సుమారు 500 లీటర్ల బెల్లం వాష్‌ను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు రోడ్డు భద్రత, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాల నివారణ, పోలీస్--ప్రజల మధ్య సత్సంబంధాల బలోపేతం, ప్రజల భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నట్లు గూడూరు సీఐ వినయ్ తెలిపారు.

ప్రజల ఓటు హక్కును కాలరాసే హక్కు ఎవరికీ లేదు..

- కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని ఎందుకు వెనకేసుకొస్తుంది.
- ఉద్యమిస్తున్న యువత పై నిర్భంధ కాండను ఖండిస్తున్నాం
- కవులు, రచయితలు, జర్నలిస్టులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో "చర్చా గోష్టి "

సిద్దిపేట, అక్టోబర్ 15 ప్రజా తీర్పు



రాజ్యాంగ బద్ధంగా ప్రజలకు కల్పించిన ఓటు హక్కును కాలరాసే హక్కు ఎవరికీ లేదని కవులు, రచయితలు, జర్నలిస్టులు, ప్రజాసంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.. సిర్ ప్రక్రియ నిర్వహణలో గందరగోళం, పెద్ద ఎత్తున ఓటర్ల ఓట్లు గల్లంతు అవుతున్న నేపథ్యంలో మంజీరా రచయితల సంఘం, టీ డబ్ల్యూజే సిద్దిపేట జిల్లా శాఖ, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక, తెలంగాణ వికాస సమితి, తెలంగాణ రచయితల సంఘం, ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో " చర్చా గోష్టి " నిర్వహించారు. సమావేశానికి మంజీరా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి, కవి, రచయిత సిద్దెంకి యాదగిరి అధ్యక్షత వహించగా.. మంజీరా రచయితల సంఘం, ఖఖజెజీ (×జీఖ) సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కె. రంగాచార్య, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు, కవి రచయిత పొన్నాల బాలయ్య, తెలంగాణ వికాస సమితి అధ్యక్షులు నందిని భగవాన్ రెడ్డి, తెరసం గౌరవ అధ్యక్షులు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి గంభీర్రావు పేట యాదగిరి, ప్రజా సంఘాల నేత పోచబోయిన శ్రీహరి,జర్నలిస్టు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూతురు రాజి రెడ్డి, ప్రజా సంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు వి. సంతోష్, ప్రముఖకవి, మరసం పూర్వ అధ్యక్షులు అలాజ్ పూర్ కిషన్, మరసం ఉపాధ్యక్షులు అలాజ్ పూర్ శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొని మాట్లాడారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ వ్యవహారం పూర్తిగా అనుమానాస్పదంగా ఉందని అన్నారు..ఓటర్ల జాబితా సవరణ పేరిట చేపట్టిన సిర్ ప్రక్రియ అనర్హులైన ఓటర్లను తొలగించడం మాట అంటుంచి లక్షలాది మంది అర్హులైన ఓటర్ల ను తొలగించి వేస్తున్నదని అన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 13 న్నర కోట్ల ఓట్లు గల్లంతు అవుతున్నట్టు, ఒక్క తెలంగాణ రాష్ట్రం లోనే సుమారు 70 లక్షల ఓట్లు గల్లంతు అవుతున్నట్టు వార్తలు వస్తున్నాయని ఇన్ని కోట్ల మంది ప్రజలు దేశంలో చనిపోయారా..? అని ప్రశ్నించారు.. సి ఈ సి సిర్ ప్రక్రియ అమలుకోసం ఏర్పాటు చేసిన నిబంధనలు విచిత్రంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు కార్డులు, విద్యా సిర్టిఫికెట్లు పుట్టినతేదీ కోసం చెల్లవని అధికారులు అనడం అసంబద్దమైన వ్యవహారం అని అన్నారు. వేలాదిమంది బతికి ఉన్న ఓటర్లకు నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. చనిపోయిన, రెండు చోట్ల ఓట్లు ఉన్నవారి ఓట్లు తొలగొంచడం ప్రభుత్వ యంత్రాంగానికి చాలా చిన్న టాస్క్ అని.. ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో సులభంగా పనిని చేయవచ్చని అన్నారు.. సిర్ ప్రక్రియ కొత్తగా జరుగుతున్నది కాదని గతంలో కూడా జరిగిందని ఇంత గందరగోళం ఎప్పుడూ లేదని అన్నారు. ప్రస్తుతం సిర్ ప్రక్రియ ను చూస్తుంటే కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారి.. ప్రశ్నించే వారి ఓట్లను తొలగించడం కోసం కుట్ర జరుగుతున్నదని భావించాల్సి వస్తున్నదని అన్నారు. సిర్ ప్రక్రియను నిలిపి వేయాలని సి ఈ సి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని యువకులు, విద్యార్థులు దేశ రాజధాని వేదిక గా చేస్తున్న ఉద్యమాన్ని కేంద్ర ప్రభుత్వం ఉక్కు పాదంతో అణిచి వేయడం దేనికి సంకేతంఅని ప్రశ్నించారు.. సిర్ ప్రక్రియ పై ప్రజలకు ఉన్న అనుమానాలను తొలగించి అర్హులైన ఓటర్లందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన సి ఈ సి కేంద్ర ప్రభుత్వం ప్ర శ్నిస్తున్న వారిని అనిచివేస్తూ జైళ్లకు పంపడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వ వ్యవహారం అనుమానాస్పదంగా ఉందని అన్నారు.. యువకుల పై, విద్యార్థులపై జరుగుతున్న దమనకాండను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రస్తుత సిర్ ప్రక్రియను నిలిపి వేసి దేశవ్యాప్తంగా, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అర్హులైన వారందరికీ సులువుగా ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కవులు, రచయితలు, ప్రజాసంఘాల ప్రతునిధులు పేర్కొన్నారు.. యువకులు, విద్యార్థులు ఢిల్లీ కేంద్రం గా చేస్తున్న ఉద్యమానికి మద్దతు ఇస్తున్నామని తెలిపారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు..



సేవా జ్యోతి శరణాలయంలో ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

- దేశ సేవకు అంకితమైన కలాం జీవితం యువతకు ఆదర్శం

(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజా తీర్పు
తాండూర్ మండలం రిపోర్టర్) అక్టోబరు 15

తాండూర్ మండలం రేచిని రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీ స్వశక్తి భారత్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా జ్యోతి శరణాలయంలో మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీ స్వశక్తి భారత్ సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీదేవి మల్లేశం గజ్జెల్లి సగర మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం ఎన్నో కష్టాలను ఎదుర్కొని పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించారని అన్నారు. చిన్ననాటి నుంచే దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగి శాస్త్రవేత్తగా, అనంతరం భారత రాష్ట్రపతిగా దేశానికి విశిష్ట సేవలందించి యువతకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణ, పట్టుదల వంటి విలువలను కలాం జీవితం నుంచి నేటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. దేశం కోసం సేవలందించిన మహనీయుల జీవిత చరిత్రలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సేవా జ్యోతి శరణాలయం నిర్వాహకులు స్వప్న కొంకటి సగర, విద్యార్థి సేవా ప్రముఖ్ సత్యకేశవ్ జిత్ సేనేంద్రవర్మ, లక్ష్మీ, శరణాలయంలోని మహిళలు పాల్గొన్నారు.



బెల్లంపల్లి కల్వరి మైదానంలో ఉపవాస దీక్ష ప్రార్థనల ముగింపు సభకు పటిష్ట బందోబస్తు

- బందోబస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్

వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 15


రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంచిర్యాల జోన్ కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బెల్లంపల్లి కల్వరి మైదానంలో గత 50 రోజులుగా కొనసాగుతున్న ఉపవాస దీక్ష ప్రార్థనల ముగింపు సభ సందర్భంగా చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ముగింపు సభకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున,వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.సభా ప్రాంగణం వద్ద ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకలకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ప్రజలు మరియు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ముగింపు సభ ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని డీసీపీ సూచించారు.



నర్సంపేట తార టి పాయింట్ వద్ద మెయిన్ రోడ్డుపై వాహనాల పార్కింగ్.. ప్రమాదాలకు దారితీసే ప్రమాదం!

నర్సంపేట అక్టోబర్ 15 ప్రజా తీర్పు క్రైం న్యూస్ ప్రతినిధి వెంకన్న

నర్సంపేట పట్టణంలోని తార టి పాయింట్ వద్ద మెయిన్ రోడ్డుకు ఆనుకుని పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనాలకు అడ్డంకులు ఏర్పడటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తార టి పాయింట్ వద్ద వరుసగా ద్విచక్ర వాహనాలను నిలిపివేయడం వల్ల రహదారిపై ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా వాహనాలు రోడ్డుపైకి రావడం వలన రన్నింగ్ లో ఉన్న వాహనాలకు ఎదురయ్యే అడ్డంకులు ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉంది. ఒక్కసారిగా వాహనాలు ఎదురైతే డ్రైవింగ్‌లో ఉన్నవారు నియంత్రణ కోల్పోయే ప్రమాదం కూడా లేకపోలేదు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవాలి సంబంధిత అధికారులు ఈ సమస్యను గుర్తించి, మెయిన్ రోడ్డుపై వాహనాల పార్కింగ్‌ను నియంత్రించాలని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు . టీ పాయింట్ యాజమాన్యం వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసుకొనే విధంగా చేసి రహదారిపై ప్రయాణించే ప్రజలకు భద్రత కల్పించాలని ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ అక్టోబర్ 15 రవీందర్ ప్రజా తీర్పు

హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట జిల్లాల అధికారులతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయం నుండి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పాటు, అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు సహాయక పరికరాలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) కింద బతుకమ్మ ఘాట్ల వద్ద శుభ్రత, మట్టి పనులు, ఇతర అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. ఏర్పాట్ల విషయంలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

పోలీస్ హెడ్ క్వార్టర్స్ లా ఆటపాటలతో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసు కానిస్టేబుళ్ల నుంచి మొదలుకొని ఉన్నతాధికారుల కోసం గురువారం సాయంత్రం హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవితతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ మరియు సెంట్రల్ జోన్ డీసీపీలు స్వయంగా సంప్రదాయ పాటలను ఆలపిస్తూ, మహిళా సిబ్బందితో కలిసి నృత్యాలు చేస్తూ మహిళా పోలీసు సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మనం ఎంత ఆధునిక జీవనశైలికి అలవాటు పడినా, మన మూలాలను, సంస్కృతి సంప్రదాయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మరచిపోకూడదని పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిర్విరామంగా బాధ్యతలు నిర్వర్తించే పోలీసు సిబ్బందికి ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్లాదాన్ని, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, హైదరాబాద్ వంటి మహానగరాలతో పోలిస్తే వరంగల్‌లోనే బతుకమ్మ ఉత్సవాలను ఎంతో ఘనంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటుతూ ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయని పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత అన్నారు వివిధ రకాల సహజసిద్ధ పూలతో ఆకర్షణీయంగా బతుకమ్మను తయారు చేసిన బరోసా సెంటర్ సిబ్బంది కి మొదటి బహుమతిని ఇస్తూ అలాగే బతుకమ్మ పాటలను పాడిన నుబేదారి పోలీస్ స్టేషన్కు చెందిన మహిళా కానిస్టేబుల్ స్వప్నను కమిషనర్ అభినందిస్తూ, ఆమెకు ప్రత్యేక బహుమతి ప్రధానం చేశారు. సంప్రదాయానికి అనుగుణంగా, వినూత్న రీతిలో పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి కొలనులో మహిళా సిబ్బంది తమ బతుకమ్మలను నిమజ్జనం చేస్తూ భక్తిశ్రద్ధలతో గంగాప్రవేశం నిర్వహించి, గౌరమ్మకు భక్తిపూర్వకంగా వీడ్కోలు పలికారు.



నర్సంపేట లో బతుకమ్మ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

నర్సంపేట అక్టోబర్ 15 ప్రజా తీర్పు క్రైం న్యూస్ ప్రతినిధి వెంకన్న

తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకైనా బతకమ్మ పండుగ వేడుకలను ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి పెండెం శ్రీలక్ష్మీరామానంద్ తెలిపారు.. పట్టణంలోని అంగడి మైదానం తోపాటు పలు వార్డుల్లోని బతుకమ్మ ఆట స్థలాలను మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, చైర్ పర్సన్ శ్రీలక్ష్మీరామానంద్ తో పాటు కౌన్సిలర్ రాయిడి కీర్తి దుష్యంత్ రెడ్డి మరియు ఇతర కౌన్సిలర్లు గురువారం నాడు పరిశీలించి పనులను పర్యవేక్షించారు.. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ బతుకమ్మ వేడుకల సందర్భంగా మహిళలకు ఇబ్బందులు కలవకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బీరం భరత్ రెడ్డి, బాణాల ప్రసన్న శ్రీనివాస్, పొన్నాల మనిషా ప్రకాష్,మండల శ్రీదేవి శ్రీనివాస్, సానిటేషన్ ఇన్స్పెక్టర్ కందిక స్వామి, జవాన్ రమేష్, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు..

రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకుజడ్.పి.హెచ్.ఎస్ బాయ్స్ హై స్కూల్ విద్యార్థినీ ఉదయశ్రీ

నర్సంపేట రూరల్, సెప్టెంబర్ 15, ప్రజా తీర్పు ప్రతినిధి:



నర్సంపేట లోని బాయ్స్ హై స్కూల్ లో 9వ తరగతి చదువుతున్న ఎడ్ల ఉదయశ్రీ రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెడ్ మాస్టర్ లిక్కి రమేష్ కుమార్ తెలిపారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలు రంగారెడ్డి జిల్లాలోని సరూర్ నగర్ స్టేడియంలో అక్టోబర్ 16వ తేదీ నుండి 18 వ తేదీ వరకు జరుగుతాయని ఫిజికల్ డైరెక్టర్ కోట రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయశ్రీని హెడ్ మాస్టర్ లిక్కి రమేష్ కుమార్ మరియు డి,రమేష్ యం,రమేష్ యస్ ఉమామహేశ్వర్ మరియు రవికుమార్ ,అబిద , గోపాల్ రావు ,బిక్షపతి, బుచ్చి రాములు, శైలజ , ఖా జా మొయినుద్దీన్ ,జ్యోతి, మరియు విద్యార్థిని విద్యార్థులుఅభినందించారు.

బాధితులకు సత్వర న్యాయం అందించడమే పోలీసుల లక్ష్యం

హుస్నాబాద్ అక్టోబర్ 15 రవీందర్ ప్రజా తీర్పు



బాధితులకు సత్వర న్యాయం అందించినప్పుడే పోలీసులు లక్ష్యం నెరవేర్చుకున్న వారు అవుతారని కరీంనగర్ సీపీ గౌస్ ఆలం అన్నారు. గురువారం చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ కాపీలు, పెండింగ్ కేసులు, రౌడీ షీటర్ల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణ, రిసెప్షన్ కౌంటర్, లాకప్ రూమ్‌లను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితుల సమస్యలను శ్రద్ధగా విని వారికి త్వరితగతిన న్యాయం చేకూర్చాలని సిబ్బందిని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం వహించరాదని, గ్రామాల్లో నిరంతరం నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) అనిల్, చిగురుమామిడి సబ్-ఇన్స్పెక్టర్ (ఎస్సై) జగదీశ్వర్ తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020